నేటి కందం- నేటికి అందం

ప్రవిమలమగు హృదయముతో
నవిరళముగ పూజసేయ నానందముతో
శివరాత్రి పర్వదినమున
భవహరు దందించు గాత పలు విజయములన్ !!

(26-2-25 మహాశివరాత్రి)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

ఎమ్మెల్సీ ఎన్నికల్లో
ఎవరు ఎవరికో నేస్తం
కలవరపడుటేల నేడు
కారు కమలం హస్తం
పట్టభద్రులెక్కడైనా
ప్రజలలోనే కొందరు
ఎవరు గెలిస్తేనేమి దాన్నే
ఎలా సర్వమనుకుందురు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ బుధవారం 26-2-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:159 పేజీలు:6 వెల: రూ.1/-

## కిక్కిరిసిన అయోధ్య ఆలయం.. రామ్‌లల్లా దర్శనం కోసం బారులు తీరిన భక్తులు..



అయోధ్య, ఫిబ్రవరి 25: అయోధ్యలో కొలువుదీరిన రామ్‌లల్లాను దర్శించుకునేందుకు భక్తులు ఎగబడుతున్నారు. రోజూ లక్షల సంఖ్యలో జనం రామయ్యను దర్శించుకుంటున్నారు. ఇంకా నిర్మాణ దశలోనే ఉన్న ఆ ఆలయానికి భక్తుల తాకిడి విపరీతంగా ఉన్నది. కుంభమేళాలో పుణ్య స్నానాలు చేసేందుకు వెళుతున్న భక్తులు.. ఆ భక్తిభావంతోనే రామయ్య సన్నిధికి కూడా తరలివస్తున్నారు. దీంతో అయోధ్య వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రతి క్షణం వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుంటున్నారు. శ్రీ రామ జన్మభూమి స్థలంలో నిర్మించిన నూతన ఆలయానికి అపరిమిత సంఖ్యలో భక్తులు పోటెత్తుతున్నారు. కుంభమేళా నుంచి డైరెక్టుగా అయోధ్య చేరుకుంటున్నారు. అనేక లైన్లలో భక్తుల్ని రామయ్య దర్శనం కోసం పంపించే ఏర్పాట్లు చేశారు.రామజన్మభూమిలో భక్త కోటి ప్రవాహాన్ని .. యాత్రికులు తమ మొబైళ్లలో బంధిస్తున్నారు. రామ్‌లల్లా దర్శనం కోసం వెళ్లిన ఓ భక్తుడు తీసిన వీడియోను పోస్టు చేస్తున్నాం. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద.. వేల సంఖ్యలో భక్తులు రామనామాన్ని స్మరిస్తూ ముందుకు వెళ్తున్నట్లు ఆ వీడియోలో ఉంది.

## శ్రీశైలంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ ప్రవీణ్





శ్రీశైలం, ఫిబ్రవరి 25:మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీశైలంలో కొనసాగుతున్నాయి. శివరాత్రి సందర్భంగా బుధవారం భారీగా భక్తులు తరలిరానున్నారు. ఈ క్రమంలో భద్రతా ఏర్పాట్లను కర్నూల్ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ పరిశీలించారు. నంద్యాల ఇన్‌చార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి క్షేత్ర పరిధిలో పర్యటించారు. దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు, ఆలయ పరిసరాలను పరిశీలించారు. సీసీటీవీల కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఎస్పీ నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి ఉన్నారు.

## విద్యార్థుల సమస్యలపై చర్చించండి.. మాజీమంత్రి జగదీష్ రెడ్డికి పీడీఎస్‌యూ వినతి





హైదరాబాద్, ఫిబ్రవరి 25: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని.. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించేలా అసెంబ్లీలో విద్యారంగ సమస్యలపై మాట్లాడాలని PDSU నాయకులు మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇవాళ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో PDSU నాయకులు జగదీష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

రాష్ట్రంలో పేద విద్యార్థులకు రావలసిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు దాదాపు 8 వేల కోట్లు రూపాయలు ఉన్నాయని.. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి కూడా విడుదల చేయలేదన్నారు. దీనివల్ల లక్షలాదిమంది విద్యార్థులు చదువుకు దూరం అయ్యే పరిస్థితి ఉందని.. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా సంస్థలకు నిధులు లేక అనేక సమస్యలతో నడుస్తున్నాయన్నారు.

కనీసం మౌలిక సదుపాయాలు లేక, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. కనీసం మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం, స్వీపర్లు కూడా సరిగా లేని పరిస్థితి దాపురించిందన్నారు. ఇవన్నీ పూర్తి చేయాలంటే విద్యా రంగానికి నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని.. అందుకు రాష్ట్ర బడ్జెట్‌ను విద్యారంగానికి ప్రభుత్వం ఇచ్చినట్టు 20 శాతం నిధులు కేటాయించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని జగదీష్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో ఖజూజ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, నాయకులు అందడి శ్రీధర్, కిరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో శివరాత్రి సంబురం

-నేటి అర్ధరాత్రి రాజన్నకు రుద్రాభిషేకం
-పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి పొన్నం
-రాత్రి 11 నుంచి 1.30 వరకు స్థానికులకు దర్శనం
-బుధవారం ఉదయం నుంచి దర్శనాలు, మొక్కుబడులు
-2.03 కోట్లతో పెద్ద ఎత్తున ఏర్పాట్లు
-1800 మంది పోలీసులు, 900 సీసీ కెమెరాలు
-మూడు రోజుల పాటు కొనసాగనున్న ప్రత్యేక పూజలు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 25:(నేటినిజం ప్రతినిధి): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంళవారం ఉదయం 5 గంటలకు లక్ష్మి గణపతిపూజ, ప్రాతఃకాల పూజలు నిర్వహించి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. రాజన్న ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాత్రి ఏడు గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అలాగే రాత్రి ఏడున్నర గంటలకు టీటీడీ తరుపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ, దేవాదాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు శివార్చన రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభించనున్నారు.

### ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ దీపాలంకరణ

మహాశివరాత్రి జాతర సందర్భంగా రాజన్న ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా.. ఆధ్యాత్మికతకు అద్దం పట్టేలా మహా జాతర వేడుకలను నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి జాతరకు ప్రభుత్వ యంత్రాంగం రూ.2.03 కోట్లు మంజూరు చేసింది. సుమారు నాలుగు లక్షల మందికి పైగా భక్తులు వస్తారనే అంచనాలతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దర్శనాల కోసం ఆలయంలో నాలుగు క్యూలైన్లు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. పుష్కరిణి వద్ద భక్తులకు నీడ కల్పించేందుకు షామియానాలు వేయించారు. ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజను పర్యవేక్షిస్తున్నారు.

### 15 వైద్యకేంద్రాలు.. 10 సహాయ కేంద్రాలు..

జాతరకు వచ్చే భక్తులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సేవలను అందించనున్నారు. 15 ప్రాథమిక వైద్యచికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. తిప్పాపూర్, జగిత్యాల ప్రయాణ ప్రాంగణాలు, నాంపల్లిగుట్ట, అమ్మవారి కాంప్లెక్స్, ఈవో కార్యాలయం, ఆలయ ప్రధానద్వారం, వైద్యశాలలో అత్యవసచికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. 104, 108 వాహనాలతో పాటు రెండు బైక్ అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. రాజన్న ఆలయ యంత్రాంగం పది చోట్ల భక్తులకు సహాయకేంద్రాలను ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు వాహనాలు నిలిపేందుకు పలుచోట్ల 12 ఖాళీ స్థలాలను సిద్ధం చేశారు. గుడిచెరువులో 25 ఎకరాల విస్తీర్ణంలో వీఐపీ, సాధారణ భక్తులకు వేర్వేరుగా పార్కింగ్లు ఏర్పాటు చేశారు. జగిత్యాల బస్టాండ్ ప్రాంతంలో, మున్నూరు కాపు సత్రం పక్కన, శాత్రాజుపల్లిరోడ్డులో, వేములవాడ మార్కెట్ యార్డు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బైపాస్ రోడ్డులో పలు స్థలాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు రద్దీగా ఉండే 20 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

### 1200 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

వేములవాడలో జరగునున్న శివరాత్రి ఉత్సవాలకు 1200 బస్సులను నడిపేందుకు ఆర్టీసీ నిర్ణయించింది. జగిత్యాల బస్ స్టాండ్ ప్రాంతం, వేములవాడ ప్రధాన బస్టాండ్ల నుంచి ఆర్టీసీ సేవలను అందించనున్నారు. సికింద్రాబాద్ బస్టాండ్ నుంచి రోజూ ప్రతి పది నిమిషాలకు ఒక్కబస్సు, జాతర ప్రత్యేక బస్సులు, 32 సాధారణ బస్సులను నడిపిస్తారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, బోధన్, కామారెడ్డిల బస్టాండ్ల నుంచి నిర్విరామంగా నడిపించనున్నారు. మరో పదిహేను మినీ బస్సులను పట్టణంలో బస్టాండ్ల నుంచి ఆలయానికి ఉచితంగా నడిపించనున్నారు.

### 1800 మంది పోలీసులు.. 900 సీసీ కెమెరాలు

పట్టణంలోని, అలాగే ఆలయ పరిసరాలు ప్రాంతాల్లో 900 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఆరుగురు డీఎస్పీల పర్యవేక్షణలో సుమారు 1800 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీసులను అవసరం బట్టి వినియోగించుకున్నారు. క్యూలైన్లల్లో తొక్కిసలాట జరుగకుండా చర్యల కోసం సిబ్బందిని కేటాయించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచి, ఐడీ పార్టీ పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించనున్నారు. మూడు అగ్నిమాపక



వాహనాలు, మూడు మొబైల్ వాహనాలను అందుబాటులో ఉంచారు.

### మంగళవారం రాత్రి 11 గంటల నుంచి

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం భక్తులకు స్వామి వారి లఘు దర్శనం ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి 11 గంటల నుండి అర్ధరాత్రి 1-30 గంటల వరకు పురజనులకు సర్వదర్శనం ఉంటుంది. రాత్రి 1.30 గంటల నుండి 2.30 గంటల వరకు దాతలు, స్థానిక అధికారులకు ప్రత్యేక దర్శనం ఉంటుంది. తెల్లవారు జామున 3.30 గంటల నుండి 3.40 గంటల వరకు ఆలయ శుద్ధి, మంగళవాయిద్యాలు. 3.40 గంటల నుండి 4.20 గంటల వరకు వరకు సుప్రభాత సేవ ఉంటుంది. ఉదయం 4.30 గంటల నుండి 6 గంటల వరకు ప్రాత:కాల పూజ అనువంశిక అర్చకుల దర్శనం. ఉదయం ఆరు గంటల నుంచి సాధారణ దర్శనాలు, మొక్కుబడులు ఉంటాయి. సాయంత్రం 6.05 గంటలకు శ్రీ స్వామివారి కల్యాణమండపంలో మహాలింగార్చన. రాత్రి 11.35 గంటలకు లింగోద్భవ కాలమందు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుంది.

## బేడ బుడగ జంగాలకి ఎమ్మెల్సీ కేటాయించాలి

-తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి రాష్ట్ర చైర్మన్ క్రాంతికర్ పోకల కిరణ్ మాదిగ

హైదరాబాద్ ఫిబ్రవరి 25 (ఎక్స్ పలిరేసస్ న్యూస్ ); బేడ బుడగ జంగాలకి ఎమ్మెల్సీ కేటాయించాలని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి రాష్ట్ర చైర్మన్ క్రాంతికర్ పోకల కిరణ్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం బర్కాత పురా సామాజిక భవన్లో ఏర్పాటుచేసిన తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.బెడ బుడగజంగం కులానికి ఒక ఓఒఅ, మాదిగ కులానికి సంబంధించిన ఉద్యమకారులకు ఒక ఓఒఅ కేటాయిస్తూ ముఖ్యమంత్రి గారు వెంటనే నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎందుకంటే త్వరలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే కోటా ద్వారా 5 ఎమ్మెల్సీ స్థానాల భర్తీ చేయనున్నందున అన్ని రంగాల్లో అత్యంత వెనుకబడినటువంటి బెడ (బుడగ) జంగం కులానికి ఒక ఎమ్మెల్సీ స్థానం ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ విధంగా పైవర్గాలకి సముచిత స్థానం కల్పించడం వల్ల రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలని అధికార కాంగ్రెస్ గెలుచుకునే అవకాశాలు మెండుగా ఉంటాయని వారు తెలిపారు. ఎందుకనగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు బేడ బుడగ జంగం కులానికి చట్టసభల్లో ప్రాతినిధ్యం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు అదేవిధంగా ఎస్సీ వర్గాల్లో మాల, మాదిగల తర్వాత అత్యధిక జనాభా కలిగిన కులం. అయినప్పటికీ, ఇప్పటికీ రాజకీయంగా ఎలాంటి అవకాశాలు రాలేదని పేర్కొన్నారు. సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన ఈ వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సమాజంలో సమతుల్యత తీసుకురాగలం కావున మాదిగ కులానికి ఒక ఎమ్మెల్సీ స్థానం - ఎస్సీల్లో అత్యధిక జనాభా కలిగిన వర్గం మాదిగలు అయినప్పటికీ, వారికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం ఇప్పటి వరకు లభించలేదు.కాబట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల సామాజిక సమతుల్యతతోబాటు ఆ వర్గాలకి అండగా నిలబడిన వారు అవుతారని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మోచి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్ ప్రేమ్ రాజ్ మహా కూటమి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కొండ రాజు మాదిగ సికింద్రాబాద్ అధ్యక్షులు జనార్ధన్ హైదరాబాద్ అధ్యక్షులు మహేష్ కుమార్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బౌద్ధ నగర్ లో కన్నుల పండుగగా కమనీయంగా శివపార్వతుల కళ్యాణం



హైదరాబాద్ ఫిబ్రవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); మహాశివరాత్రి పర్వదిన పురస్కరిఉంచుకొని సికింద్రాబాద్ బౌద్ధ నగర్ లో ని అంబర్ నగర్ లో మార్కండేయ దేవాలయం లో శివపార్వతుల కళ్యాణం కమనీయంగా కన్నుల పండుగగా జరిగినది. ఈ వేడుకలో ఎదుగనిలతా, దేవేందర్ మరియు శ్రీ ఆట్ రాంచందర్ ఫ్యామిలీ పాల్గొని కళ్యాణం నిర్వహించారు. కళ్యాణంకు ముందు గా సర్వదేవతల పూజా, రుద్ర హోమం లో మృత్యుంజయ మంత్రాన్ని జపించడం జరిగింది. చివరగా పూర్ణాహుతి నిర్వహించారు.ఈ కార్యక్రమం లో తెలంగాణ ప్రాంత పద్మశాలి మహిళా అధ్యక్షురాలు గుంటక రూప సదాశివ్ ,స్వర్గం బాబు, వర ప్రసాద్, ప్రేమ్, బొమ్మ నరేంద్ర, జనరల్ సెక్రటరీ చిన్నకోట్ల సప్నా రాజ్ , గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం సెక్రటరీ బల్ల గీత, అలువేలు, శశికళ, వ్రాల మారుతి,గోశిక శేఖర్, కల్లెపల్లి రాజు ,ఆనంద్ పాల్గొన్నారు చివరగా అన్నదాన కారుఅక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ 11వ సంవత్సరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ఇన్చార్జి బొమ్మ నరేంద్ర మాట్లాడుతూ11వ సంవత్సరాలుగా అంబర్ నగర్ లో మార్కండేయ దేవాలయం లో శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యకలాపాల్లో పాల్గొనాలని,నిత్యం శివుడిని పూజిస్తే, సకల దోషాలు తొలగి, శుభం జరుగుతుందన్నారు. హాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణం లో పాల్గొన్న ప్రతి వారికి రక్షణ ఉంటుందన్నారు.

## టన్నెల్‌లో చిక్కుకున్న వారికోసం వచ్చిన జార్ఖండ్ కార్మికుల బృందం..!

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25:దోమలపెంట వద్ద ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న నలుగురు కార్మికుల బంధువులను జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంటకు పంపింది. జార్ఖండ్ రాష్ట్ర మైనింగ్ ఆఫీసర్ అవినాష్ ఆధ్వర్యంలో వీరు దోమలపెట్టకు చేరుకున్నారు. ఈ బృందం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్‌ను కలిసింది.

ఇక్కడ జరుగుతున్న ఏర్పాట్లపై ఈ బృందం కార్మికుల బంధువులకు అధికారులు చెప్పారు. గత నాలుగు రోజులుగా ఇక్కడ జరుగుతున్న రెస్క్యూ ఆపరేషన్ తీరు తెన్నులను బంధువులకు వివరించారు. ప్రమాదానికి ఒకరోజు ముందే కుటుంబ సభ్యులతో మాట్లాడినట్టు జార్ఖండ్ మైనింగ్ ఆఫీసర్ అవినాష్ తెలిపారు.

### 27న ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు హరీష్ రావు రాక

ఈ నెల 27వ తేదీన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు మాజీ మంత్రి హరీష్ రావు రానున్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న కార్మిక కుటుంబాలను మాజీ మంత్రి హరీశ్ రావు పరామర్శిస్తారు. అలాగే టన్నెల్‌లో రెస్క్యూ టీం నిర్వహిస్తున్నటువంటి రెస్క్యూ ఆపరేషన్ పరిశీలిస్తారని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.



# హిందూ మహాసభ వ్యవస్థాపకులు వీర సావర్కర్

## (26 ఫిబ్రవరి "వీర సావర్కర్ వర్ధంతి" సందర్భంగా)

హిందుత్వవాది, హిందువుల బంధువు, ధైర్యవంతుడు, దేశభక్తుడు, కవి, రచయిత, న్యాయవాది, రాజకీయవేత్త, జాతీయతావాది అయిన "వీర్ సావర్కర్" అసలు పేరు "వినాయక్ దామోదర్ సావర్కర్". ఆయన వ్యక్తిత్వం తెలిసిన మిత్రులు ఆయన ధైర్యసాహసాలను మెచ్చి ఇచ్చిన బిరుదు వీర్ లేదా వీరుడు. ఆయన కవిత్వం, సాహిత్యం చదివి భారతీయులెందరో ప్రేరణ పొంది స్వాతంత్ర్య పోరాటంలో కదం తొక్కారు. హిందువుల ఐక్యతకు కృషి చేస్తూనే ముస్లిమ్‌లకు ప్రత్యేక గుర్తింపును వ్యతిరేకించిన మేధావి సావర్కర్. మహాత్మాగాంధీ సిద్ధాంతాలను సహితం బహిరంగంగా వ్యతిరేకించిన ధీరుడు. గాంధీ హత్యలో భాగం ఉందనే నెపం వేయగా కోర్టులో నిరపరాధిగా బయట పడ్డారు. 01 ఫిబ్రవరి 1966న "ఆత్మార్పణ" చేసుకుంటానని ప్రకటించి ఆహారం తీసుకోవడం మానేసి 26 ఫిబ్రవరి 1966న వీరమరణం పొందారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం సావర్కర్ చిత్రపటాన్ని 2003ల పార్లమెంటు ఆవరణలో ఆవిష్కరించారు.

చిన్ననాటి నుంచే ఉద్యమ బాట:

28 మే 1883న నాకిక్ జిల్లా భాగూర్‌లోని బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన వినాయక్ దామోదర్ సావర్కర్, తన 12వ ఏటనే మిత్రులను ఏకం చేసి సమాజ హితం కోరని ముస్లిమ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించారు. "మిత్ర మేళ", "ఫ్రీ ఇండియా సొసైటీ" లాంటి సంస్థలను స్థాపించి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. పూనెలో న్యాయపట్టాను పొంది ఉపకారవేతనంతో యూకెలో ఉన్నత విద్యను అభ్యసించారు. లాల్ బాల్ పాల్ త్రయం ప్రేరణతో స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. "ది హిస్టరీ ఆఫ్ ది వార్ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్" అనే పుస్తకాన్ని రాసి భారతీయుల్లో దేశభక్తిని రగిలించారు. సావర్కర్ ఉద్యమాలను వ్యతిరేకించి బ్రిటీష్ పాలకులు ఆయనను అండమాన్ నికోబార్ "కాలా పానీ" సెల్యులార్ జైల్లో 50 ఏండ్ల పాటు శిక్ష వేసి బంధించి తీవ్రంగా వేధించారు.

### హిందూవాది - గాంధీ విధానాల వ్యతిరేకి:

"హిందుత్వ : హూ ఈజ్ ఏ హిందూ ?" అనే కరపత్రం తీసి హిందు సమాజాన్ని జాగృత పరిచారు. బౌద్ధులు, సిక్కులు, పార్సీలు, హిందువులు మాత్రమే "అఖండ భారత్"లో ఉండాలని "భరతవర్ష్" అనే పేరును భారత్‌కు ఇచ్చారు. ప్రత్యేక గుర్తింపు పొందుతున్న ముస్లిమ్, క్రిస్టియన్లకు వ్యతిరేకంగా నిలిచి పోరాడారు. 1924లో "రత్నగిరి హిందూ మహాసభ"ను ఏర్పాటు చేసి "హిందూ మహాసభ"క నాయకత్వం వహించారు. ఖిలాఫత్ ఉద్యమ సమయంలో గాంధీ గారి ముస్లిమ్ పక్షపాత విధానాలను బహిరంగా వ్యతిరేకించి గాంధీని కపటుడిగా, సంకుచిత అపరిపక్వ మనస్తత్వం కలవాడని ప్రకటించారు.

భరతమాత ముద్దుబిడ్డ, పరమ దేశభక్తుడు, సాహితీవేత్త, హిందూ ఐక్యతా మూర్తి, రాజకీయవేత్త, న్యాయవాది, 59వ వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ వారు చూపిన వీరత్వాన్ని పునికిపుచ్చుకొని మనం కూడా దేశభక్తులమని చేతల్లో నిరూపించుకుందాం, వీర్ సావర్కర్ చిత్రపటానికి మాలలు వేసి పాదాభివందనాలు చేద్దాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# మండలిలో మాటలు తూటాలు.. నారా లోకేష్, బొత్స మధ్య వాగ్వాదం

-వైసీపీ సభ్యులను ఏకిపారేసిన మంత్రి లోకేష్
-తప్పుడు అభియోగాలు చేస్తే సహించబోమని ఫైర్
-వీసీలను బలవంతంగా రాజీనామా చేయించారన్న ఎమ్మెల్సీ కల్యాణి
-ఆధారాలు బయటపెట్టాలని లోకేష్ డిమాండ్
-అందరి జాతకాలు తేలుస్తామని మంత్రి ఆగ్రహం

అమరావతి, ఫిబ్రవరి 25:ఏపీ శాసనమండలిలో వాడీ వేడి చర్చ జరగింది. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చలో భాగంగా మంగళవారం కూటమి, వైసీపీ ఎమ్మెల్సీల మధ్య రగడ చోటు చేసుకుంది. ఉద్యోగాల కల్పన



అంశంపై వైసీపీ.. టీడీపీ మధ్య మాటల యుద్ధం నడిచింది. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల కోసం పలు ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని మంత్రి నారా లోకేశ్ శాసనమండలిలో వెల్లడించారు. రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టులు వస్తాయని, తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతుండగా వైసీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ జోక్యం చేసుకుని, రాష్ట్రంలో 4 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ముందే ఎలా చెబుతారని ప్రశ్నించారు. దీనికి మంత్రి లోకేశ్ వివరణ ఇస్తూ.. పెట్టుబడులు పెట్టగానే ఉద్యోగాలు వస్తాయని తాము చెప్పడంలేదన్నారు. పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటవుతాయని, వాటితో పాటు అనుబంధ సంస్థలలో యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. కాగా, మంగళవారం పలు అంశాలపై శాసన మండలిలో ఎన్డీయే కూటమి, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

బలవంతంగా వీసీల రాజీనామా.. ఇచ్చిపడేసిన లోకేష్

గవర్నర్ ప్రసంగం అంశంలో తెలుగు ఇంగ్లీష్‌లో ప్రచురణల మధ్య తేడా ఉందని గందరగోళం నెలకొంది. ప్రజలను ఇబ్బంది పెడుతూ సుపరిపాలన అని చెప్పడం కూటమి ప్రభుత్వానికి ఎంత వరకు సమంజసమని వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్సీ కల్యాణి ప్రశ్నించారు. గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారని మండిపడ్డారు. నాలుగు లక్షల మంది ఉద్యోగాలు కల్పించామని స్పష్టంగా గవర్నర్ ప్రసంగంలో ఉందని వైసీపీ ఎమ్మెల్సీ అన్నారు. గవర్నర్ ప్రసంగం తెలుగు అనువాదంలో తేడా ఉందని. తప్పుంటే మార్చుకుంటామని చెప్పండి అని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కోరారు. ఇదే సమయంలో ఇక తమ ప్రభుత్వంలో నియమించిన యునివర్సిటీ వైస్ ఛాన్సలర్లను బెదిరించి రాజీనామా చేయించారని కల్యాణి సభలో ఆరోపించారు.

విద్యుత్ చార్జీలు పెంచలేదు

పవర్ చార్జెస్ పెంచమంటున్నారు.. ఎక్కడ ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జ్ పెంచలేదు అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ కౌంటర్ ఇచ్చారు.. కూటమి ప్రభుత్వం వాలంటీర్లను మోసం చేశారిన ఎమ్మెల్సీ కల్యాణి ఆరోపించగా.. వాలంటీర్లను వైసీపీ వాళ్లే రాజీనామా చెయ్యించారని గుర్తుచేశారు మంత్రి లోకేష్.. వాలంటీర్లకు 10 వేలు పెంచుతాం అన్నారు.. వాలంటీర్లు పాపం పూతరేకుల ఆర్డర్ కూడా పెట్టుకుని వెళ్లి ఓటు వేశారని విమర్శించారు.. ఇక, మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. గత ఏడాది ఇదే సమయంలో వాలంటర్లను రెన్యువల్ చేయకుండా మోసం చేసింది వైసీపీనే అని మండిపడ్డారు.. ఇలా వైసీపీ వర్సెస్ కూటమి ప్రభుత్వంగా శాసనమండలి మారిపోయింది.. వైసీపీ సభ్యులు వాస్తవాలు మాట్లాడాలన్నారు లోకేష్. వాకౌట్ చేయొద్దని.. అన్నింటిపైనా చర్చిద్దామని తెలిపారు. ఇంగ్లీష్ మీడియం కావాలని అంటారు? మళ్ళీ ఇంగ్లీష్‌లో చెప్తే ఇబ్బంది అంటారని మంత్రి అన్నారు.

# కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూల్‌లో ఏర్పాటు చేయాలి..



అమరావతి, ఫిబ్రవరి 25:రాయలసీమ ప్రాంతం ఎడారి కాకుండా ఉండాలి అంటే శ్రీశైలం ప్రాజెక్టు పరిధిలో ఉన్న కర్నూల్ లో కృష్ణానది యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలని నంద్యాలలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథ రామిరెడ్డి, నంద్యాల సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, సీపీఐ పట్టణ కార్యదర్శి కే.ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, భాస్కర్ శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, సంజీవులు బాలకృష్ణ, రైతులు వేలాదిగా పాల్గొని నిరసన ధర్నా ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలాగా, అధికారం చేపట్టిన తర్వాత మరొక లాగా వ్యవహరించి ప్లేటు ఫిరాయించడం తగదని ఆరోపించారు.

శ్రీశైలం ప్రాజెక్టు రాయలసీమ ప్రజల జీవనాడి అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు కోసం కర్నూలు జిల్లాలోని ప్రజలు వేలాది ఎకరాల భూమిని కోల్పోయి సర్వస్వం కోల్పోయిన ఈ ప్రాంతంలో రాయలసీమ ప్రాంతమైన కర్నూల్ లో కృష్ణా బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ హామీ ఇచ్చిందని పేర్కొన్నారు.

రాయలసీమలో ఉన్న వందల మంది ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్లమెంట్ సభ్యులు కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేసేందుకు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నంద్యాలలో నిర్వహించిన ర్యాలీ విజయవంతమైంది. నంద్యాల జిల్లాతో పాటు రాయలసీమ ప్రాంత రైతులు వేలాదిగా తరలివచ్చారు. ఈ ర్యాలీని చూసి అయినా ప్రభుత్వానికి కనువిప్పు కలిగి కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ర్యాలీలో రాయలసీమ ప్రాంత రైతుల నినాదాలు ఆక్రందన రూపంలో వెలువడ్డాయి.

## వాహనం బోల్తా.. నలుగురు పోలీసులకు తీవ్రగాయాలు !

సంగారెడ్డి, ఫిబ్రవరి 25:సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పోలీసు వాహనం బోల్తా కొట్టడంతో.. నలుగురు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 3 వద్ద టైరు బ్లాస్ట్ కావడంతో సైబరాబాద్ కమిషనరేట్ చెందిన పోలీసు వాహనం బోల్తా కొట్టింది. ఈ ప్రమాదం నేపథ్యంలో వాహనంలో ఉన్న నలుగురు పోలీస్ సిబ్బందికి తీవ్ర గాయాలు అయ్యాయి. సైబరాబాద్ కమిషనరేట్ నుంచి సంగారెడ్డి జైలుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది.

# జయలలిత జయంతి సందర్భంగా ఆమెను సంస్మరించుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:జయలలిత జయంతి సందర్భంగా ఆమెను ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ సంస్మరించుకున్నారు. తమిళనాడు అభివృద్ధి కోసం జీవితాన్ని వెచ్చించిన విశిష్ట పరిపాలనాదక్షురాలు, ప్రజల పట్ల ఆదరం చూపిన నేత జయలలిత అని శ్రీ మోదీ కొనియాడారు.

''జయలలిత జీ జయంతి సందర్భంగా ఆమెను సంస్మరించుకుంటున్నాను. తమిళనాడు అభివృద్ధి కోసం తన జీవితాన్ని వెచ్చించిన మేటి పరిపాలనాదక్షురాలు, ప్రజల పట్ల సదా ఆదరం చూపిన నేతగా ఆమె ఎందరి అభిమానాన్నో పొందారు. అనేక సందర్భాల్లో ఆమెతో సంభాషించే అవకాశం కలగడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. ప్రజలకు మేలు చేసే ఏ పథకానికైనా ఆమె తమ సంపూర్ణమైన మద్దతుని అందించేవారు" అని పేర్కొన్నారు.

"జయలలిత జీ జయంతి నాడు ఆమెను సంస్మరించుకుంటున్నాను. తమిళనాడు రాష్ట్రాభివృద్ధి కోసం సదా తపించిన మేటి పరిపాలనాదక్షురాలు, ప్రజల పట్ల ఆదరాభిమానాలు చూపిన నేతగా ఆమె అందరి ప్రేమనూ చూరగొన్నారు. పలు సందర్భాల్లో ఆమెతో సంభాషించే అవకాశం కలగడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. ప్రజా సంక్షేమం కోసం చేపట్టే ఏ పథకానికైనా ఆమె తమ మద్దతుని అందించేవారు" అని పేర్కొన్నారు.

# చంద్రబాబుతో వీహెచ్ భేటి

అమరావతి, ఫిబ్రవరి 25: తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు ఏపీ సీఎం చంద్రబాబును కలిశారు. ఇవాళ విజయవాడలో ఆయనను కలిసిన వీహెచ్ ఏపీలోని ఒక జిల్లాకు నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం, దివంగత నేత దామోదరం సంజీవయ్య పేరును పెట్టాలని, స్మృతివనం నిర్మించాలని కోరారు. ఇందుకు చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. దళిత ముఖ్యమంత్రి అయిన సంజీవయ్య అత్యంత నిజాయి తీపరుడని వీహెచ్ కొనియాడారు. అందుకే ఏపీలో ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టాలని కోరినట్లు వెల్లడించారు.

# కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

-టిడిపి నాయకులు కోలను వేణుగోపాల్ రెడ్డి

హైదరాబాద్ ఫిబ్రవరి 25(ఎక్స్‌ప్రెస్ న్యూస్ );బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని టిడిపి నాయకులు కోలను వేణుగోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లు దాటినా బిఆర్ఎస్ నేతలు మనం ఇంకా ఆంధ్ర పాలకుల పాలనలో ఉన్నామన్న భ్రమలు పడుతున్నారని విమర్శించాం. ముఖ్యమంత్రి తీరు టోపి మాత్రం తన నెత్తి మీద పెట్టుకొని ,లాటి మాత్రము పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చేతిలో పెడుతుండు..గురుశిష్య సంబంధమును నిజము చేస్తూ కృష్ణా జలాలను వక్కరాష్ట్రం వాళ్లకు వదిలిపెడుతుండు..కనీసం ఐఖీఓః రక్షణ కోసము ప్రభుత్వ పక్షాన పోరాటం చేస్తలే అంటున్నారని అసలు బిఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో చేసింది ఏమిటని ప్రశ్నించారు. ఐఖీఓః ని అనుక్షణము ఐఅఖీ తన ఆధీనంలో పెట్టుకొని తెలంగాణ రైతాంగానికి నీరు అందించినపుడు మరి తెలంగాణ ఆంధ్ర నీటి గొడవలు ఎందుకు సాగుతున్నాయని ప్రశ్నించారు.

# ఈ సంవత్సర బడ్జెట్ ద్వారా భారత వృద్ధిలో చోదకశక్తి పాత్ర పోషిస్తున్న అన్నింటినీ బలోపేతం చేశామన్న ప్రధాని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు మధ్యప్రదేశ్ భోపాల్ లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్-2025 (జీఐఎస్)ను ప్రారంభించారు. సదస్సుకు ఆలస్యంగా చేరుకున్నందుకు క్షమాపణలు తెలియచేసిన ప్రధాని, బోర్డు పరీక్షలకు హాజరయ్యే 10వ, 12వ తరగతి విద్యార్థులు, తన రాక కోసం ఇదే మార్గంలో చేసే భద్రతాపరమైన ఏర్పాట్ల వల్ల ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఆలస్యంగా బయలుదేరినట్లు చెప్పారు. భోజరాజు పాలించిన ప్రాంతంలో ఏర్పాటైన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సుకు మదుపర్లను, వ్యాపారవేత్తలను ఆహ్వానించడం తనకు గర్వకారణమని శ్రీ మోదీ అన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో వికసిత్ మధ్యప్రదేశ్ కీలకం కాబట్టి నేటి కార్యక్రమం ముఖ్యమైందని ప్రధాని అన్నారు. సదస్సు నిర్వహణ కోసం అద్భుతమైన ఏర్పాట్లను చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా శ్రీ మోదీ అభినందించారు.

"భారత్ పట్ల ప్రపంచం మొత్తం సానుకూలంగా ఉంది.." అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. భారత్ చరిత్రలో ఇటువంటి అవకాశం కలగడం ఇదే మొదటిసారని అన్నారు. సాధారణ పౌరులు, విధానకర్తలు, సంస్థలు, ప్రపంచ దేశాలు సహా అందరికీ భారతదేశం పట్ల గొప్ప అంచనాలున్నాయని చెప్పారు. గత కొద్ది వారాలుగా భారత్ గురించి వినిపిస్తున్న సకారాత్మక వార్తలు పెట్టుబడిదార్లలో ఉత్సాహాన్ని పెంచగలవని ఆశిస్తున్నట్లు చెప్పారు. భారత్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని ఇటీవల ప్రపంచ బ్యాంకు ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేసిన ప్రధాని, "ప్రపంచ భవిష్యత్తుకు భారతదేశమే ఆధారం!" అన్న ఓఈసీడీ ప్రతినిధి మాటలని కూడా ఉటంకించారు. వాతావరణ మార్పులను పర్యవేక్షించే ఒక ఐక్యరాజ్య సమితి సంస్థ భారత్ ను సోలార్ సూపర్ పవర్ గా అభివర్ణించిందని చెప్పారు. మిగతా దేశాలు మాటలకే పరిమితమైతే, భారత్ మాత్రం చేతల్లో చూపుతోందని అదే సంస్థ చెప్పిందన్నారు. ప్రపంచ ఏరోస్పేస్ సంస్థల అవసరాలను సకాలంలో తీర్చగల అద్వితీయమైన సరఫరా వ్యవస్థలను భారత్ కలిగి ఉందని ఇటీవల వెలువడిన ఒక నివేదిక స్పష్టం చేసిందని ప్రధాని అన్నారు. సరఫరా వ్యవస్థల్లో ఎదుర్కొనే చిక్కులకు భారత్ సరైన పరిష్కారమని ఆయా సంస్థలు భావిస్తున్నాయని చెప్పారు. భారత్ పై వివిధ దేశాలకు గల విశ్వాసాన్ని సోదాహరణంగా తెలిపిన ప్రధాని, వారి విశ్వాసం మన రాష్ట్రాలకు భరోసానిస్తోందన్నారు. మధ్యప్రదేశ్ పెట్టుబడిదారుల సదస్సులో ఈ నమ్మకం స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

జనాభా లెక్కల ప్రకారం మధ్యప్రదేశ్ దేశంలో ఐదో అతి పెద్ద రాష్ట్రమన్న ప్రధాని, "వ్యవసాయానికి, కీలక ఖనిజాలకీ ఎంపీ పెట్టింది పేరు'' అన్నారు. జీవప్రదాయిని నర్మదా నదిని కలిగిన రాష్ట్రం, స్థూల జాతీయోత్పత్తి పరంగా దేశ తొలి అయిదు రాష్ట్రాల జాబితాలో స్థానం పొందగల సత్తాను కలిగి ఉందని చెప్పారు.

గత రెండు దశాబ్దాల్లో రాష్ట్రం పరివర్తన దిశగా ప్రయాణం చేస్తోందని, అంతకు మునుపు విద్యుత్ లోటు, నీటి కొరత, శాంతి భద్రతల సమస్యలు వంటి అనేక సవాళ్ళను రాష్ట్రం ఎదుర్కొందని గుర్తు చేశారు. ఇటువంటి సమస్యల వల్ల పారిశ్రామిక అభివృద్ధి కుంటుపడేదని చెప్పారు. అయితే, ప్రజల అండదండలతో మధ్యప్రదేశ్ ప్రభుత్వం గత రెండు దశాబ్దాల్లో సుపరిపాలనపై దృష్టి కేంద్రీకరించిందని అన్నారు. రెండు దశాబ్దాల కిందట రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వెనక్కి తగ్గేవారనీ, ఇప్పటి పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉందనీ, పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా మధ్యప్రదేశ్ పేరు తెచ్చుకుందని శ్రీ మోదీ తెలిపారు. ఒకప్పుడు గతుకుల రహదారులతో సతమతమైన ఇదే రాష్ట్రం, ఇప్పుడు విద్యుత్ వాహనాల విప్లవంలో దేశంలోని అగ్ర రాష్ట్రాల సరసన నిలుస్తోందని చెప్పారు. జనవరి 2025 నాటికి రాష్ట్రంలో 2 లక్షల విద్యుత్ వాహనాల నమోదు జరిగిందని, ఇది 90 శాతం కన్నా అధిక వృద్ధి రేటని చెప్పారు. నూతన తరహా ఉత్పాదన రంగాలకు రాష్ట్రం అనువైనదని ఈ వృద్ధి స్పష్టం చేస్తోందని ప్రధానమంత్రి అభిప్రాయపడ్డారు.

"గత దశాబ్దంలో మౌలిక సదుపాయాల రంగంలో భారత్ అత్యధిక వృద్ధిని నమోదు చేసింది" అన్న ప్రధాని, మధ్యప్రదేశ్ ఈ అభివృద్ధి ఫలాలను ఇతోధికంగా పొందిందని చెప్పారు. రెండు ముఖ్య పట్టణాలను కలిపే ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ వే అనేక చోట్ల రాష్ట్రం నుంచి ప్రయాణిస్తోందని, దాంతో ముంబయి ఓడరేవులు, ఉత్తర భారతదేశ మార్కెట్లకు అనుసంధానం వేగవంతమవుతోందని అన్నారు. ప్రస్తుతం మధ్యప్రదేశ్ అయిదు లక్షల కిలోమీటర్లకు పైగా రహదార్లను కలిగి ఉందని ప్రధాని వెల్లడించారు. ఎంపీ పారిశ్రామికవాడలకు ఆధునిక ఎక్స్‌ప్రెస్ వే లతో అనుసంధానం ఎంతో మెరుగయ్యిందని, దరిమిలా రవాణా రంగంలో అభివృద్ధి వేగం పుంజుకుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

గగనమార్గ అనుసంధానాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో గ్వాలియర్, జబల్ పూర్ విమానాశ్రయాల్లోని టెర్మినళ్లను విస్తరించారని శ్రీ మోదీ తెలియజేశారు. మధ్యప్రదేశ్ లోని రైల్వే వ్యవస్థను ఆధునీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయని చెప్పారు. ఇప్పుడు ఎంపీలోని రైల్వే వ్యవస్థ వంద శాతం విద్యుదీకరణను సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. భోపాల్ లోని రాణీ కమలాపతి రైల్వే స్టేషన్ చిత్రాలు ఇప్పటికీ అందరినీ మంత్ర ముగ్ధులను చేస్తూనే ఉన్నాయని చెపుతూ, ఇదే నమూనాని అనుసరించి అమృత భారత్ స్టేషన్ పథకం కింద రాష్ట్రంలోని 80 రైల్వే స్టేషన్ల నవీకరణ పనులు చేపట్టనున్నారని వెల్లడించారు.

"గత దశాబ్దంలో భారత ఇంధన రంగం మునుపెన్నడూ లేని అభివృద్ధిని నమోదు చేసింది" అంటూ హర్షాన్ని ప్రకటించిన శ్రీ మోదీ, హరిత ఇంధనరంగంలో ఒకప్పుడు ఊహకే అందని వృద్ధిని నేడు దేశం సాధించి చూపుతోందన్నారు. గత పదేళ్ళలో పునరుత్పాదక ఇంధనరంగంలో 70 బిలియన్ డాలర్ల (5 ట్రిలియన్ కన్నా అధికమైన) మేర పెట్టుబడులు జరిగాయని, దాంతో కేవలం గత సంవత్సరంలోనే హరిత ఇంధన రంగంలో దాదాపు 10 లక్షల మేర ఉపాధి కల్పన సాధ్యపడిందన్నారు. ఇంధన రంగంలో జరిగిన వృద్ధి మధ్యప్రదేశ్ కు లాభించిందని ప్రధాని అన్నారు. 31,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో రాష్ట్రం మిగులు సాధించిందని, మొత్తం విద్యుదుత్పాదనలో 30 శాతం హరిత ఇంధన రంగానికి సంబంధించిందేనని తెలియజేశారు. దేశంలోనే అతి పెద్ద సోలార్ పార్క్ రేవాలో ఉందని, ఇటీవల ఓంకారేశ్వర్ లో నీటిపైన తేలియాడే సోలార్ ప్లాంట్ ను ప్రారంభించారని వెల్లడించారు. మధ్యప్రదేశ్ ను పెట్రో కెమికల్స్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం బీనా రిఫైనరీ పెట్రోకెమికల్స్ కాంప్లెక్స్ లో రూ. 50,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టిందన్నారు. ప్రభుత్వం ఈ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుకు ఆధునిక విధానాలు, ప్రత్యేక పారిశ్రామిక సదుపాయాల ద్వారా మద్దతునిస్తోందని చెప్పారు. ఎంపీలో 300 కు పైగా పారిశ్రామిక వాడలున్నాయని, పితంపూర్, రత్లామ్, దేవాస్ లలో వేల ఎకరాల్లో పెట్టుబడి ప్రాంతాల అభివృద్ధి జరుగుతోందని, మధ్యప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టే వారికి ఇబ్బడిముబ్బడిగా లాభాలు దక్కే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని శ్రీ మోదీ అన్నారు.

పారిశ్రామికాభివృద్ధి కోసం నీటి భద్రత అత్యావశ్యకమన్న ప్రధానమంత్రి.. ఒకవైపు జలసంరక్షణ కోసం కృషిచేస్తూనే, మరోవైపు బృహత్తర కార్యక్రమమైన నదుల అనుసంధానాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ లోని వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఈ కార్యక్రమాల వల్ల ఎంతగానో ప్రయోజనం పొందుతాయన్నారు. రూ.45,000 కోట్లతో ఇటీవల ప్రారంభించిన కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు.. మధ్యప్రదేశ్ లో దాదాపు 10 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమిలో ఉత్పాదకతను పెంచుతుందని, నీటి నిర్వహణను బలోపేతం చేస్తుందని శ్రీ మోదీ తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయిక పరిశ్రమలు, టెక్స్ టైల్ రంగాల్లో ఈ సదుపాయాలు విశేషంగా అవకాశాలను అందిస్తాయని ఆయన చెప్పారు.

మధ్యప్రదేశ్‌లో తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి వేగం రెట్టింపైందని వ్యాఖ్యానించిన శ్రీ మోదీ.. రాష్ట్ర, దేశ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం మధ్యప్రదేశ్ ప్రభుత్వంతో భుజం భుజం కలిపి పనిచేస్తోందన్నారు. ఈ దఫా మూడో సారి అధికారం చేపట్టిన తర్వాత మూడు రెట్లు వేగంగా పనిచేస్తానని ఎన్నికల సందర్భంగా తాను ఇచ్చిన హామీని ఆయన గుర్తుచేశారు. "ఈ వేగం 2025 మొదటి 50 రోజులలో స్పష్టంగా కనిపిస్తుంది" అన్నారు. ఇటీవలి బడ్జెట్ భారత వృద్ధికి ఊతమిచ్చే ప్రతి అంశాన్నీ ఉత్తేజితం చేసేదిగా ఉందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. అత్యధిక సంఖ్యలో పన్ను చెల్లింపుదారులుగా ఉన్న మధ్యతరగతి ద్వారానే సేవలు, తయారీలకు డిమాండ్ ఏర్పడుతుందని ఆయన స్పష్టంచేశారు. రూ.12 లక్షల వరకు ఆదాయాన్ని పన్ను రహితంగా మార్చడం, పన్ను శ్లాబులను పునర్వ్యవస్థీకరించడం సహా మధ్యతరగతి సాధికారత కోసం పలు చర్యలను ఈ బడ్జెట్ లో తీసుకున్నారు. ఈ బడ్జెట్ తర్వాత ఆర్బీఐ వడ్డీ రేట్లను తగ్గించిందని కూడా ఆయన పేర్కొన్నారు.

తయారీలో పూర్తి స్వావలంబన సాధించడం కోసం స్థానిక సరఫరా శ్రేణులను బలోపేతం చేయడంపై బడ్జెట్ దృష్టిసారించిందని చెప్తూ.. గత ప్రభుత్వాలు స్థానిక సరఫరా శ్రేణులను అవసరమైన స్థాయిలో అభివృద్ధి చేయకుండా ఎంఎస్ఎంఈల సామర్థ్యాన్ని పరిమితం చేశాయని శ్రీ మోదీ అన్నారు. ఎంఎస్ఎంఈ ఆధారిత స్థానిక సరఫరా శ్రేణులను నిర్మించడమే ప్రస్తుతం తమ ప్రాధాన్య అంశమని ఆయన స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈల నిర్వచనాన్ని పెంచామని, రుణ అనుసంధాన ప్రోత్సాహకాలను అందించామని, అలాగే రుణ లభ్యతను మరింత సులభతరం చేశామని, అదనపు విలువను పొందడానికీ ఎగుమతులకూ మరింతగా చేయూతనిచ్చామని కూడా ఆయన తెలిపారు.

బడ్జెట్ లో ప్రస్తావించిన రాష్ట్రాల నియంత్రణల సడలింపు కమిషన్ గురించి వివరిస్తూ.. "గత దశాబ్ద కాలంగా జాతీయ స్థాయిలో గణనీయమైన సంస్కరణలు వేగం పుంజుకున్నాయి. ఇప్పుడు రాష్ట్ర, స్థానిక స్థాయిల్లోనూ సంస్కరణలను ప్రోత్సహిస్తున్నాం" అని ప్రధానమంత్రి అన్నారు. రాష్ట్రాలతో నిరంతరం చర్చిస్తున్నామని, రాష్ట్రాల సహకారంతో ఇటీవలి సంవత్సరాల్లో 40,000కు పైగా అనుమతులను తగ్గించామని ఆయన తెలిపారు. అంతేకాకుండా వ్యవహారంలో లేని 1,500 చట్టాలను తొలగించినట్లు ఆయన పేర్కొన్నారు. సులభతర వాణిజ్యానికి అవరోధాలుగా ఉన్న నియంత్రణలను గుర్తించడానికే ఈ చర్యలు తీసుకున్నామని, రాష్ట్రాల్లో పెట్టుబడి అనుకూల నియంత్రణల వ్యవస్థను నెలకొల్పడంలో ఈ సడలింపు కమిషన్ సహాయపడుతుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

ఈ బడ్జెట్ ప్రాథమిక కస్టమ్స్ సుంకాల నిర్మాణాన్ని సరళతరం చేసిందని, పరిశ్రమకు అవసరమైన అనేక ఉత్పాదకాలపై ధరలను తగ్గించిందని శ్రీ మోదీ ప్రముఖంగా పేర్కొన్నారు.

కస్టమ్స్ స్థితిగతులను అంచనా వేయడానికి కాలపరిమితిని నిర్దేశించుకున్నట్టు తెలిపారు. ఔత్సాహిక ప్రైవేటు వ్యవస్థాపకులకు, పెట్టుబడులకు కొత్త రంగాలను అందుబాటులోకి తేవడం కోసం జరుగుతున్న కృషిని ఆయన వివరించారు.

ఈ ఏడాది అణు ఇంధనం, బయో మాన్యుఫాక్చరింగ్, కీలక ఖనిజాల ప్రాసెసింగ్, లిథియం బ్యాటరీ తయారీ వంటి రంగాల్లో పెట్టుబడులకు అవకాశం కల్పించామని, ప్రభుత్వ సంకల్పానికీ నిబద్ధతకూ ఈ చర్యలు నిదర్శనమని అన్నారు.

"భవిష్యత్తులో భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపడంలో వస్త్ర పరిశ్రమ, పర్యాటకం, సాంకేతికత రంగాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి కోట్లాది ఉద్యోగాలను సృష్టిస్తాయి" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. పత్తి, పట్టు, పాలిస్టర్, విస్కోజ్ ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో ఉందన్నారు. వస్త్రపారిశ్రామిక రంగం కోట్లాది మందికి ఉద్యోగాలను కల్పిస్తోందన్నారు. ఆ రంగంలో సుసంపన్నమైన సంప్రదాయం, నైపుణ్యాలు, ఔత్సాహిక పారిశ్రామికత భారత్ సొంతమన్నారు. భారత పత్తి రాజధానిగా మధ్యప్రదేశ్ పేరెన్నిక గన్నదని, దేశ సేంద్రియ పత్తి సరఫరాలో దాదాపు 25 శాతం వాటా ఆ రాష్ట్రానికి ఉందని చెప్పారు. మల్బరీ పట్టులోనూ అతిపెద్ద ఉత్పత్తిదారుగా మధ్యప్రదేశ్ ఉందనీ, ఈ రాష్ట్రానికి చెందిన చందేరీ, మహేశ్వరి చీరలు అమితంగా ప్రసిద్ధి చెంది భౌగోళిక గుర్తింపు ట్యాగ్ ను పొందాయని తెలిపారు. మధ్యప్రదేశ్ వస్త్రపరిశ్రమకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తేవడంలో ఈ రంగంలో పెట్టుబడులు విశేషంగా ప్రభావం చూపుతాయని ఆయన స్పష్టం చేశారు.

సాంప్రదాయిక టెక్స్ టైల్ రంగంతోపాటు సరికొత్త మార్గాలను భారత్ అన్వేషిస్తోందని చెప్తూ.. ఆగ్రో టెక్స్ టైల్స్, మెడికల్ టెక్స్ టైల్స్, జియో టెక్స్ టైల్స్ వంటి టెక్నికల్ టెక్స్ టైల్స్ ను ప్రోత్సహిస్తున్నామని ప్రధానమంత్రి వివరించారు. ఇందుకోసం ఒక జాతీయస్థాయి మిషన్ ను ప్రారంభించామని, దాన్ని ప్రోత్సహించడానికి బడ్జెట్ లో ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన పీఎం-మిత్ర పథకం బాగా ప్రసిద్ధి చెందిందని, మధ్యప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా ఏడు పెద్ద టెక్స్‌టైల్ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని శ్రీ మోదీ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా టెక్స్ టైల్ రంగంలో వృద్ధి మరింత ఉన్నత స్థితికి చేరుతుందన్నారు. ఈ రంగం కోసం ప్రకటించిన పీఎల్ఐ పథకాన్ని పెట్టుబడిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానమంత్రి కోరారు.

టెక్స్ టైల్ రంగంలో కొత్త కోణాలను ఆవిష్కరిస్తున్న విధంగానే పర్యాటక రంగాన్ని కూడా భారత్ అభివృద్ధి చేస్తోందని శ్రీ మోదీ అన్నారు. 'మధ్యప్రదేశ్ అజబ్ హై, సబ్ సే గజబ్ హై' అన్న రాష్ట్ర పర్యాటక నినాదాన్ని గుర్తుచేశారు. మధ్యప్రదేశ్ లో నర్మదా నది చుట్టుపక్కల ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో పర్యాటక మౌలిక సదుపాయాలు విశేషంగా అభివృద్ధి చెందడాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో ఉన్న అనేక జాతీయ పార్కుల గురించి, ఆరోగ్య, వైద్య పర్యాటకంలో ఉన్న అపారమైన అవకాశాల గురించి ప్రధానమంత్రి మాట్లాడారు. 'భారత్ లో స్వస్థత' మంత్రప్రదంగా మారి అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందుతోందని, ఆరోగ్య, వైద్య రంగాల్లో పెట్టుబడి అవకాశాలు క్రమంగా పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భారతదేశ సంప్రదాయిక చికిత్సలు, ఆయుష్ ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని, ప్రత్యేక ఆయుష్ వీసాలను జారీ చేస్తున్నామని శ్రీ మోదీ వివరించారు. ఈ కార్యక్రమాలు మధ్యప్రదేశ్ కు ఎంతగానో మేలు చేస్తాయన్నారు. పర్యాటకులు ఉజ్జయినిలోని మహాకాల్ మహాలోక్ ను సందర్శించి, అక్కడ మహాకాలుడి ఆశీస్సులు పొందాలని కోరిన ఆయన.. తద్వారా దేశ పర్యాటక, ఆతిథ్య రంగం ఎంతలా విస్తరిస్తోందో తెలుస్తుందన్నారు.

ఎర్రకోట నుంచి చేసిన తన ప్రకటనను పునరుద్ఘాటించిన ప్రధానమంత్రి.. మధ్య ప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడానికి, పెట్టుబడులను పెంచడానికి ఇదే సరైన తరుణమని చెప్తూ ప్రసంగాన్ని ముగించారు.

# బీహార్ భాగల్పూర్ నుంచి 'పీఎం కిసాన్' 19వ విడత నిధుల విడుదల సహా

# పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:వ్యవసాయదారుల సంక్షేమమే పరమావధిగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు పీఎం కిసాన్ పథకం 19వ విడత నిధులను బీహార్ భాగల్పూర్ వేదికగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు ఇతర సంక్షేమ పథకాలను కూడా ప్రారంభించారు. అంతర్జాలం ద్వారా కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ప్రధాని స్వాగతం పలికారు. మహాకుంభ్ పావన సందర్భంలో మందరాంచల్ ప్రాంతంలోకి అడుగు పెట్టడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు. ఆధ్యాత్మికత, వారసత్వ సంపదలకు ఆలవాలమైన ఈ ప్రాంతం వికసిత్ భారత్ లక్ష్యానికి కూడా అనువైనదని అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు తిల్కా మాంఝీ స్మృతికే గాక భాగల్పూర్ పట్టు నగరంగా కూడా ప్రసిద్ధి చెందిందన్నారు. బాబా అజ్గైబినాథ్ నడయాడిన పవిత్ర క్షేత్రంలో, రానున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాట్లు ప్రారంభమయ్యాయన్నారు. ఇటువంటి శుభదినాల్లో పీఎం కిసాన్ 19వ విడత నిధులను విడుదల చేసే అదృష్టం తనకు దక్కిందని, సుమారు రూ. 22,000 కోట్ల సొమ్ము ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా నేరుగా రైతన్నల ఖాతాల్లోకి జమ అయ్యిందన్నారు.

పీఎం కిసాన్ పథకం లబ్ధి పొందుతున్న 75 లక్షల బీహార్ రైతు కుటుంబాలకి ఈరోజు పథకం 19వ విడత నిధులను విడుదల చేశామన్నారు. బీహార్ అన్నదాతల ఖాతాల్లోకి ఈరోజు రూ. 1600 కోట్ల మేర సొమ్ము జమ అయ్యిందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని బీహార్ రైతు కుటుంబాలు సహా దేశంలోని అన్ని వ్యవసాయ కుటుంబాలకు అభినందనలు తెలియజేశారు.

తన ఎర్రకోట ప్రసంగంలోని భాగాలను గుర్తుచేస్తూ, "పేదలు, రైతులు, యువత, మహిళలు వికసిత్ భారత్ కు గల నాలుగు ప్రధాన స్తంభాలు'' అన్నారు. కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వమైనా రైతుల సంక్షేమమే తమ ప్రాధాన్యమన్నారు. "గత దశాబ్దంలో రైతుల ప్రతి సమస్యను పరిష్కరించడానికి మేము పూర్తి శక్తియుక్తులను వెచ్చించాం" అని శ్రీ మోదీ అన్నారు. రైతులకు మంచి విత్తనాలు, సరిపడే మొత్తంలో అందుబాటు ధరల్లో ఎరువులు, నీటిపారుదల సౌకర్యాలు, వారి పశువులకు వ్యాధుల నుంచి రక్షణ, విపత్తుల సమయంలో నష్టాల నుంచి భద్రత అవసరమని ప్రధానమంత్రి అన్నారు. గతంలో రైతులు ఈ సమస్యలన్నిటితో సతమతమయ్యేవారని, తమ ప్రభుత్వం ఈ పరిస్థితిని మార్చివేసిందని, ఇటీవలి సంవత్సరాలలో వందలాది ఆధునిక విత్తన రకాలను రైతులకు అందించామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. గతంలో యూరియా కోసం రైతులు ఆగచాట్లు పడేవారని, అక్రమ వ్యాపారాన్ని ఎదుర్కోవలసి వచ్చేదని, అదే ఈరోజున రైతులకు సరిపడా ఎరువులు అందుతున్నాయని తెలిపారు. మహమ్మారి సంక్షోభ సమయంలో కూడా రైతులకు ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసిందని గుర్తు చేసిన శ్రీ మోదీ, తమ ప్రభుత్వం అధికారంలోకి రాకుంటే ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతూనే ఉండేవారని వ్యాఖ్యానించారు. మూతపడ్డ బరౌని ఎరువుల కర్మాగారం ఇప్పటికీ కార్యకలాపాలు ప్రారంభించేది కాదని అభిప్రాయపడ్డారు. భారతీయ రైతులు ఎరువుల బస్తా ఒక్కింటికి రూ.300 కంటే తక్కువ ధరను చెల్లిస్తూ ఉంటే, అనేక దేశాల్లో అదే బస్తాకి రూ.3,000 చెల్లిస్తున్నారని చెప్పారు. రూ. 3,000 విలువ చేసే యూరియా సంచులు రైతులకు అందుబాటు ధరల్లో లభ్యమయ్యేలా తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ప్రధానమంత్రి వెల్లడించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తుందని హామీ ఇచ్చారు. రైతులు యూరియా, డీఏపీ నిమిత్తం ఖర్చు పెట్టవలసిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. గత 10 సంవత్సరాల్లో రైతులు ఖర్చు చేయవలసిన రూ.12 లక్షల కోట్లు సొమ్మును వారి తరుఫున కేంద్ర ప్రభుత్వమే భరించిందని శ్రీ మోదీ అన్నారు. దీని వల్ల దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులకు కోట్లాది రూపాయల మేర డబ్బు ఆదా అయిందని ఆయన తెలిపారు.

పీఎమ్ కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా గడిచిన ఆరేళ్లలో రూ.3.7 లక్షల కోట్లు రైతుల ఖాతాలకు నేరుగా జమ చేసినట్లు శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రభుత్వ పథకాల నుంచి ప్రయోజనాలు పొందలేకపోయిన చిన్న, సన్నకారు రైతులు ఇప్పుడు పూర్తిస్థాయి ప్రయోజనాలను పొందుతున్నారని పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని మధ్యవర్తులు దోచుకోకుండా నివారించడంలో కేంద్ర ప్రభుత్వం అలాగే నితీశ్ కుమార్ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విజయం సాధించాయన్నారు. మేం రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్న మొత్తం గత ప్రభుత్వాల వ్యవసాయ బడ్జెట్ కంటే ఎక్కువగా ఉందని ప్రధానమంత్రి తెలిపారు. రైతుల సంక్షేమం పట్ల నిబద్ధత గల ప్రభుత్వాలతోనే ఇది సాధ్యమవుతుందన్న శ్రీ మోదీ, అవినీతిలో కూరుకుపోయిన వారు ఇలాంటి పనులు చేయలేరని విమర్శించారు.

గత ప్రభుత్వాలు రైతుల కష్టాలను ఏనాడూ పట్టించుకోలేదన్న ప్రధానమంత్రి, కరువులు, వరదల వంటి విపత్తుల సమయాల్లో రైతులు ఎన్నో కష్టాలుపడి కడుపునింపుకునే పరిస్థితులు గతంలో ఉండేవన్నారు. 2014లో తమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించిన అనంతరం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. రైతుల కోసం తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎమ్ ఫసల్ బీమా యోజన ద్వారా రైతులు విపత్తుల సమయంలో నష్టపోయిన పంటల కోసం రూ.1.75 లక్షల కోట్ల పరిహారం పొందారని ప్రధానమంత్రి తెలిపారు.

భూమిలేని, చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచడం కోసం తమ ప్రభుత్వం పశుపోషణను ప్రోత్సహించిందని ప్రధానమంత్రి తెలిపారు. "లఖ్‌పతి దీదీలు" సైతం పశుపోషణ ద్వారా వారి ఆదాయాన్ని పెంచుకున్నారనీ, ఇప్పటివరకు బీహార్‌లోని వేలాదిమంది జీవికా దీదీలతో పాటుగా దేశవ్యాప్తంగా 1.25 కోట్ల మంది మహిళలు లక్షాధికారులు (లఖ్‌పతి దీదీలు) గా మారారని ప్రధాని వివరించారు. "గత దశాబ్ద కాలంలో దేశంలో పాల ఉత్పత్తి 14 కోట్ల టన్నుల నుంచి 24 కోట్ల టన్నులకు పెరిగి, నేడు ప్రపంచంలో పాల ఉత్పత్తిలో భారత్ ప్రథమ స్థానానికి చేరింది" అని తెలిపిన ప్రధానమంత్రి, ఈ విషయంలో బీహార్ పాత్రను ప్రశంసించారు. బీహార్ పాల సహకార సంఘాలు రోజుకు 30లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేస్తూ, ఏడాదికి సుమారు 3వేల కోట్ల రూపాయలను స్థానిక పాడి రైతులు, మాతృమూర్తులు, సోదరీమణుల ఖాతాల్లో జమ చేస్తున్నాయని ఆయన తెలిపారు.

పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తూ నైపుణ్యంతో దానిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న శ్రీ రాజీవ్ రంజన్ కృషిని ప్రశంసిస్తూ, వారి కృషి కారణంగా బీహార్‌లో వేగంగా పురోగమిస్తున్న రెండు ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రస్తావించారు. మోతీహారీలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నాణ్యమైన దేశీయ పశు జాతులను అభివృద్ధి చేస్తుండగా, బరౌనీలోని పాల ప్లాంట్ 3లక్షల మంది పాడి రైతులకు ప్రయోజనకరంగా ఉంటూ, యువతకు ఉపాధి అవకాశాలను అందించడం పట్ల ప్రధానమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన మత్స్యకారులు, పడవల యజమానులకు తమ ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డులను ఇచ్చి అండగా నిలిచిందని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. తమ ప్రభుత్వ కృషి కారణంగా, చేపల ఉత్పత్తిలో గతంలో దేశంలోని పది రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్న బీహార్, నేడు గణనీయ పురోగతితో మొదటి ఐదు రాష్ట్రాల సరసన నిలిచిందని ఆయన పేర్కొన్నారు. మత్స్యరంగ సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో చిన్న రైతులు, మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం కలిగిందన్న ప్రదానమంత్రి, భాగల్పూర్ గంగా డాల్ఫిన్స్ కోసం ప్రసిద్ధిగాంచడం నమామి గంగే ప్రచారం సాధించిన ఘన విజయంగా అభివర్ణించారు.

"మా ప్రభుత్వం ఇటీవల చేపట్టిన చర్యలతో భారత వ్యవసాయ సంబంధ ఎగుమతులు గణనీయంగా పెరిగాయి'' అని ప్రదానమంత్రి తెలిపారు. ఫలితంగా రైతులు వారి ఉత్పత్తులకు అధిక ధరలు పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎగుమతి చేయని ఎన్నో ఉత్పత్తులు నేడు అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్నాయన్న శ్రీ నరేంద్ర మోదీ, ఇప్పుడు బీహార్ మఖానా ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశించే సమయం వచ్చిందన్నారు. భారత నగరాల్లో అత్యుత్తమ అల్పాహారంగా మఖానా ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన మఖానా బోర్డు ఏర్పాటు రైతులకు మఖానా ఉత్పత్తి, ప్రాసెసింగ్, విలువ పెంపు, మార్కెటింగ్ వంటి అంశాల్లో సహాయకరంగా ఉంటుందని ఆయన తెలిపారు.

బీహార్ రైతులు, యువత కోసం బడ్జెట్‌లో ప్రస్తావించినట్లుగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన ప్రధానమంత్రి, తూర్పు భారతంలో ఆహార శుద్ధి రంగానికి బీహార్ ప్రధాన కేంద్రంగా మారనుందని తెలిపారు. అలాగే రాష్ట్రంలో వ్యవసాయానికి సంబంధించి మూడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భాగల్పూర్‌లో ఏర్పాటు చేయబోయే కేంద్రం జర్దాలు రకం మామిడి పంటపై దృష్టిసారించనుండగా, ముంగేర్, బక్సర్‌లలో ఏర్పాటు చేయనున్న కేంద్రాలు టమాట, ఉల్లి, అలాగే బంగాళాదుంప రైతులకు సహాయం చేస్తాయని శ్రీ మోదీ వివరించారు. రైతులకు ప్రయోజనం కలిగించే ఏ అవకాశాన్నీ తమ ప్రభుత్వం వదిలిపెట్టబోదని ఆయన స్పష్టం చేశారు.

''భారత్ వస్త్రాల ప్రధాన ఎగుమతిదారుగా మారుతోంది" అని తెలిపిన ప్రధానమంత్రి, వస్త్రరంగ అభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భాగల్పూర్ పట్టు, టస్సర్ పట్టుకు దేశంలోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందన్న శ్రీ మోదీ, అందుకే భాగల్పూర్ చెట్లకు బంగారం పండుతుందనే పేరు వచ్చిందని తెలిపారు. ఫ్యాబ్రిక్, నూలు డైయింగ్ యూనిట్స్, ఫ్యాబ్రిక్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు సహ పట్టు పరిశ్రమ కోసం మౌలికవసతులను మెరుగుపరిచేందుకు కేంద్రం ఎంతగానో కృషి చేస్తుందని ప్రధానమంత్రి తెలిపారు. దీని ద్వారా భాగల్పూర్ నేతన్నలకు ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో పాటు, వారి ఉత్పత్తులు ప్రపంచంలోని ప్రతి మూలకూ చేరేందుకు వీలు కలిగిందన్నారు.

సరిపడా వంతెనలు లేకపోవడం రాష్ట్రంలో అనేక సమస్యలకు కారణంగా పేర్కొన్న శ్రీ మోదీ, నదులపై సాధ్యమైనన్ని వంతెనలు నిర్మించడం ద్వారా బీహార్‌లో రవాణా ఇబ్బందులను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. గంగానదిపై రూ.1100 కోట్లతో చేపట్టిన నాలుగు వరుసల రహదారి వంతెన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు.

బీహార్‌లో వరద నష్టాలను తగ్గించడం కోసం వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చిన పశ్చిమ కోసి కాలువ ఈఆర్ఎమ్ ప్రాజెక్టు ద్వారా మిథిలాంచల్ ప్రాంతంలోని 50వేల ఎకరాలకు సాగునీరంది, లక్షలాది రైతు కుటుంబాలకు ప్రయోజనం కలగనుందని తెలిపారు.

''రైతుల ఆదాయాన్ని పెంచేందుకు మా ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రయత్నిస్తోంది" అని తెలిపిన ప్రధానమంత్రి, దిగుబడులు పెంచడం, పప్పులు, నూనెగింజల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించడం, మరిన్ని ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటు, భారత ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కి చేర్చడం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. ప్రపంచంలోని ప్రతీ వంటగదిలో భారత్‌లో పండిన ఒక్క ఉత్పత్తి అయినా ఉండాలనే దార్శనికతకు అనుగుణంగా పీఎమ్ ధన్ ధాన్య యోజనను ప్రకటించామన్నారు. ఈ పథకం కింద అత్యంత తక్కువ పంట ఉత్పత్తులు ఉన్న 100జిల్లాలను గుర్తించి, అక్కడ వ్యవసాయాన్ని ప్రోత్సహించే చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. పప్పుల సాగులో స్వయంసమృద్ధి సాధన కోసం విశేష కృషి జరుగుతుందనీ, దీనికోసం పప్పులు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తూ, కనీస మద్దతు ధరను సైతం పెంచినట్లు ప్రదానమంత్రి వివరించారు.

దేశంలో పదివేల ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం సాకారమైన ఈరోజు చాలా ప్రత్యేకమైనదిగా శ్రీ మోదీ అభివర్ణించారు. మొక్కజొన్న, వరి, అరటి పంటలపై ప్రధానంగా దృష్టిసారించే ఈ పదివేలో ఎఫ్‌పీఓ బీహార్‌లోని ఖగారియా జిల్లాలో నేడు ఏర్పాటు కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎఫ్‌పీఓలు కేవలం సంస్థలు మాత్రమే కాదనీ, రైతుల ఆదాయాన్ని పెంచే అపూర్వ శక్తి కేంద్రాలని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఎఫ్‌పీఓల ద్వారా చిన్న రైతులకు నేరుగా గణనీయ ప్రయోజనాలు, అపార అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 30లక్షల మంది ఈ ఎఫ్‌పీఓలతో అనుబంధం కలిగి ఉండగా వారిలో 40శాతం మంది మహిళలే కావడం విశేషమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ ఎఫ్‌పీఓల ద్వారా వ్యవసాయ రంగంలో ప్రస్తుతం వేల కోట్ల వ్యాపారం జరుగుతుందన్న శ్రీ మోదీ, ఈ సందర్భంగా ఎఫ్‌పీఓల సభ్యులందరికీ అభినందనలు తెలిపారు.

బీహార్ పారిశ్రామిక అభివృద్ధిని ప్రస్తావిస్తూ, ప్రభుత్వం భాగల్పూర్‌లో పెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, దీనికోసం సరిపడా బొగ్గు సరఫరా జరుగుతుందని శ్రీ మోదీ తెలిపారు. దీనికోసం కేంద్రం బొగ్గు అనుసంధానాన్ని ఆమోదించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కేంద్రంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ బీహార్ అభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు స్థానిక యువతకు కొత్త ఉపాధి అవకాశాలను కల్పించగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

"వికసిత్ భారత్ ప్రయాణం పూర్వోదయతో ప్రారంభమవుతుంది" అని వ్యాఖ్యానించిన ప్రధానమంత్రి, బీహార్‌ను తూర్పు భారతానికి మూలస్తంభంగా, భారత సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా అభివర్ణించారు. గత ప్రభుత్వాలు అవినీతి పాలనతో బీహార్‌ను నాశనం చేసి, అపఖ్యాతి పాలు చేశాయని విమర్శించిన ఆయన, అభివృద్ధి చెందిన భారత్‌లో బీహార్ తిరిగి నాటి సుసంపన్న పాటలీపుత్ర ప్రతిష్ఠను సొంతం చేసుకోవడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. దీనికోసం ఆధునికత, రహదారుల అనుసంధానం, ప్రజాసంక్షేమ పథకాలకు మద్దతునివ్వడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రూ. 5వేల కోట్లతో ముంగేర్ – భాగల్పూర్ మిర్జా చౌకీ వరకు నూతన జాతీయ రహదారిని నిర్మించనున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు. అలాగే భాగల్పూర్ నుంచి హంసడీహా వరకు నాలుగు వరసల రహదారి విస్తరణ పనులు ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. విక్రమశిల నుంచి కటారియా వరకు కొత్త రైలు మార్గం, రైల్వే వంతెన ఏర్పాటుకు భారత ప్రభుత్వం అనుమతించినట్లు ప్రధానమంత్రి పేర్కొన్నారు.

సాంస్కృతిక, చారిత్రక ప్రాముఖ్యత గల భాగల్పూర్ నాటి విక్రమశిల విశ్వవిద్యాలయ కాలంలో ప్రపంచ విజ్ఞానకేంద్రంగా ఉండేదని ప్రధానమంత్రి తెలిపారు. నలంద విశ్వవిద్యాలయ ప్రాచీన వైభవాన్ని ఆధునిక భారత్‌తో అనుసంధానించే కృషి జరుగుతోందన్న ఆయన, విక్రమశిలలోనూ కేంద్ర విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసే పనులు ప్రారంభించామన్నారు. ఈ విషయంలో సహకారం అందించిన ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, బీహార్ ప్రభుత్వ బృందానికి ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు.

"భారత అద్భుత వారసత్వ పరిరక్షణ అలాగే సుసంపన్న భవిత నిర్మాణం కోసం మా ప్రభుత్వం రాష్ట్రాలతో కలిసి పనిచేస్తోంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాను భారత విశ్వాసం, ఐక్యత, సామరస్యానికి ప్రతీకగా నిలిచే అతిపెద్ద పండుగగా ఆయన అభివర్ణించారు. యూరప్ జనాభా కంటే ఎక్కువ మంది మహాకుంభ్‌లో పుణ్యస్నానాలు చేశారనీ, బీహార్ పల్లెల నుంచీ ప్రజలు మహాకుంభ్‌కు వెళ్తున్నారని పేర్కొన్న ప్రధానమంత్రి, ఈ మహా ఉత్సవం గురించి తప్పుగా మాట్లాడుతున్న పలు పార్టీల తీరును విమర్శించారు. నాడు రామ మందిరం గురించి తప్పుగా మాట్లాడిన వారే నేడు మహాకుంభ్ గురించి కూడా విమర్శలు చేస్తున్నారన్న శ్రీ మోదీ, అలాంటి వారిని బీహార్ ప్రజలు క్షమించరని తెలిపారు. సుసంపన్న బీహార్ సాధన కోసం ప్రభుత్వం అవిశ్రాంత కృషిని కొనసాగిస్తుందన్న శ్రీ మోదీ, దేశ రైతులకు, బీహార్ ప్రజలకు అభినందనలు తెలిపారు.

బీహార్ గవర్నర్ శ్రీ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, బీహార్ ముఖ్యమంత్రి శ్రీ నితీశ్ కుమార్, కేంద్ర మంత్రులు శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, శ్రీ జితన్ రామ్ మాంఝీ, శ్రీ గిరిరాజ్ సింగ్, శ్రీ లాలన్ సింగ్, శ్రీ చిరాగ్ పాశ్వాన్, కేంద్ర సహాయ మంత్రి శ్రీ రామ్ నాథ్ ఠాకూర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతు సంక్షేమం పట్ల ప్రధానమంత్రి నిబద్ధతకు అనుగుణంగా భాగల్పూర్‌లో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. పీఎమ్ కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా పీఎమ్ విడుదల చేసిన నిధులతో దేశవ్యాప్తంగా 9.7 కోట్లకు పైగా రైతులు రూ. 21,500 కోట్లకు పైగా ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనాలను పొందనున్నారు.

రైతులు తమ ఉత్పత్తుల ద్వారా మెరుగైన ఆదాయం పొందేలా చేయడంపై ప్రధానమంత్రి ప్రధానంగా దృష్టిసారించారు. దీనికోసం పదివేల రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓలు) ఏర్పాటు చేసి, వాటిని ప్రోత్సాహించడం కోసం కేంద్రప్రభుత్వ రంగ పథకాన్ని 2020, ఫిబ్రవరి 29న ప్రధానమంత్రి ప్రారంభించారు. రైతులు వారి వ్యవసాయ ఉత్పత్తులను సమిష్టిగా ఉత్పత్తి చేయడానికి, విక్రయించడానికి ఇవి సహాయం చేస్తాయి. ఐదు సంవత్సరాల్లోనే, ఈ కార్యక్రమం ద్వారా దేశంలో పదివేలో ఎఫ్‌పీఓ ఏర్పాటుతో ప్రధానమంత్రి ఆశయం నెరవేరింది.

రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద మోతీహారీలో నిర్మించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఇండిజీనస్ బ్రీడ్స్ కేంద్రాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. అత్యాధునిక ఐవీఎఫ్ పద్ధతులను ప్రవేశపెట్టడం, మరింత దిగుబడి కోసం దేశీయ జాతులకు చెందిన మేలైన పశువులను ఉత్పత్తి చేయడం అలాగే ఆధునిక పునరుత్పత్తి విధానాలను గురించి రైతులకు, సంబంధిత నిపుణులకు శిక్షణ ఇవ్వడం దీని ప్రధాన లక్ష్యాలు. 3 లక్షల మంది పాల ఉత్పత్తిదారులకు వ్యవస్థీకృత మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో బరౌనిలో ఏర్పాటు చేసిన పాల ఉత్పత్తి ప్లాంట్‌ను కూడా ఆయన ప్రారంభించారు.

అనుసంధానం, మౌలిక సదుపాయాల అభివృద్ధి పట్ల తన నిబద్ధతకు అనుగుణంగా, రూ. 526 కోట్లకు పైగా నిధులతో నిర్మించిన వారిసాలిగంజ్–నవాడా–తిలయ్యా రైలు సెక్షన్ డబ్లింగ్‌ను అలాగే ఇస్మాయిల్‌పూర్ – రఫీగంజ్ రహదారి పైవంతెనను కూడా ప్రధానమంత్రి ప్రారంభించి, జాతికి అంకితం చేశారు.

## భక్తులకు ఇబ్బంది రాకుండా చూసుకోవాలి : డీఎస్పీ కృష్ణ కిశోర్



వరంగల్, ఫిబ్రవరి 25:మహాశివరాత్రిని పురస్కరించుకొని జరిగే భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి కళ్యాణానికి హాజరయ్యే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని తొర్రూర్ డీఎస్పీ కృష్ణ కిశోర్ బందోబస్తు సిబ్బందికి సూచించారు. కురవి మండల కేంద్రంలోని ఓం ఫంక్షన్ హాల్లో జాతర బందోబస్తుపై డీఎస్పీ జీ. మోహన్‌తో కలిసి బందోబస్తు సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వీరభద్రస్వామి జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు.

జాతరలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ముఖ్యంగా సామాన్య భక్తులకు దర్శనం, వీఐపీ దర్శనం, కళ్యాణ ప్రాంగణం, పార్కింగ్ విషయాల వద్ద తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించి, పలు సూచనలు చేసారు. జాతరలో ముగ్గురు డీఎస్పీలు, 11 మంది సీఐలు, 28 ఎస్సైలు, 200 మంది సిబ్బంది పని చేస్తారన్నారు. వీరితో పాటు షీ టీంలు, దొంగతనాలు జరగకుండా క్రైమ్ పార్టీలు అందుబాటులో నిరంతరం పర్యవేక్షిస్తుంటాయని అన్నారు. జాతరలోని ముఖ్య కూడలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జాతరకు హాజరయ్యే భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు సర్వయ్య, రాజేష్, రవి, దేవేందర్, కురవి, సీరోలు ఎస్సైలు గండ్రాతి సతీష్, సీహెచ్ నగేష్ పాల్గొన్నారు.

# దేశంలో ఊబకాయం తీవ్ర సమస్యగా మారుతోంది

### -ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం
### -ఈ సమస్యను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి
### -వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచన

న్యూ డిల్లీ ఫిబ్రవరి 25 (ఏక ప్రెస్ న్యూస్ );దేశంలో ఊబకాయం తీవ్ర సమస్యగా మారుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించారు. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 10 మంది ప్రముఖులను ప్రధాని మోదీ నామినేట్ చేశారు. బకాయం సమస్య గురించి ప్రధాని మోదీ ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావిం చారు. గత కొన్నేళ్లుగా ఊబకాయం కేసులు రెట్టింపు అయ్యాయని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా పిల్లల్లో ఊబకాయం కేసులు పెరగడం ఆందోళనకరమైన అంశమని పేర్కొన్నారు. 'ఫిట్ అండ్ హెల్తీ దేశంగా మారాలంటే.. మనం ఊబకాయం సమస్యను ఎదుర్కోవాలి. గత కొన్నేళ్లుగా ఊబకాయం కేసులు రెట్టింపు అయ్యాయి. మరింత ఆందోళనకర విషయం ఏంటంటే.. పిల్లల్లో ఊబకాయ సమస్య నాలుగు రెట్లు పెరిగింది' అని ప్రధాని మోదీ తెలిపారు. 2022లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన గణాంకాల ప్రకారం.. ప్రపంచ వ్యాప్తంగా 250 కోట్ల మంది అధిక బరువుతో బాధపడుతున్నారన్నారు. ప్రతి ఎనిమిది మందిలో ఒకరు ఊబకాయం సమస్యను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఇది చాలా ఆందోళనకర అంశమని ప్రధాని పేర్కొన్నారు. దీన్ని అధిగమించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తినే ఆహారంలో వంట నూనె వాడకాన్ని పది శాతం మేర తగ్గిం చాల సూచిం చారు. బకాయంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 10 మంది ప్రముఖులను ప్రధాని మోదీ నామినేట్ చేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా, జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాతో పాటు, యువ షూటర్ మను బాకర్, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, ప్రముఖ నటులు దినేశ్‌లాల్ యాదవ్ అలియాస్ నిరా

# చెట్లకు డిజిటల్ ఆధార్ .. ముఖ్రా కె సర్పంచ్

# మీనాక్షికి మాజీ ఎంపి సంతోష్ కుమార్ ప్రశంసలు



హైదరాబాద్, ఫిబ్రవరి 25:పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పడమే కానీ, అందుకు తగిన విధంగా కృషి చేసే వారు చాలా అరుదుగా ఉంటారు. ముఖ్రా కె సర్పంచ్ గాడ్గె మీనాక్షి పర్యావరణ పరిరక్షణకు కొత్తబాట వేశారు. 'డిజిటల్ ట్రీ ఆధార్' తో ప్రతి చెట్టును జియో–ట్యాగ్ చేయడం, క్యూఆర్ కోడ్‌లను కేటాయించారు. అవి వృద్ధి, ఆరోగ్యాన్ని ట్రాక్ చేయడమే కాకుండా జవాబుదారీతనం, స్థిరత్వాన్ని ప్రోత్సహిస్తాయి. నిజమైన నాయకత్వం, పర్యావరణ బాధ్యత అంటే ఇదే! ప్రతి చెట్టు ఆధార్ కార్డులతో పౌరుల వలె వృద్ధి చెందేలా ఈ విప్లవాత్మక ఆలోచనకు మద్దతు ఇద్దామని బీఆర్ఎస్ నేత, ప్రకృతి ప్రేమికుడు సంతోష్ కుమార్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఇందుకు ఆమెను అభినందించారు.

# కుల గణన సర్వేలో వివరాలు తెలపాలి..

### -బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పిలుపు.

హైదరాబాద్, ఫిబ్రవరి 25: కుల గణన సర్వేలో పాల్గొనని వారు సర్వే వివరాలు తెలపాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ పిలుపునిచ్చారు. కుల గణన సర్వేలో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బౌద్ధ నగర్, సీతాఫల్‌మండి తదితర డివిజన్లలో పర్యటించారు. అనంతరం ఆయన వారాసిగూడలోని జడ్ ఎం ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ.. కుల గణన సర్వేలో పాల్గొని వారు, మళ్లీ ఇప్పుడు తప్పకుండా సర్వే వివరాలు తెలపాలని కోరారు. ఆన్‌లైన్‌లో గాని ఇంటికి ముందు వచ్చే ఎనిమినేటర్లకు గాని వివరాలు తెలిపి సర్వేలో పాల్గొనాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి కుల గణన సర్వే వివరాలు ప్రజల నుంచి తెలుసుకొని కులగణన సర్వే కానీ ఇంటికి ఎమ్యునరేటర్లను పంపి సర్వే చేపించారు.

ఈ సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ సంతోశ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కుటుంబం కుల గణ సర్వేలో పాల్గొనాలని.. ఒకవేళ అందుబాటులో లేకపోతే వారు 040 21111111 నంబర్ కి ఫోన్ చేసి వివరాలు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మాజీ ఉపాధ్యక్షులు సృజన్ కుమార్, మాదిరెడ్డి జలంధర్ రెడ్డి , షకీల్ ఖాన్, జామ అనిల్ కుమార్, వాహిదుద్దీన్ లడ్డు, ప్రతాప్, చక్రధర్, బబ్లు, కుద్దూస్, శేఖర్, శోభ, రాధ, కల్పన, కిరణ్, మహేశ్, ప్రేమ్, బాలరాజ్, బ్రహ్మాజీ, నిస్సార్, రమేశ్, జనార్ధన్, ఆమె తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలి.. కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 25: ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకవైపు సహాయక చర్యలను మరింత వేగవంతంగా కొనసాగిస్తూనే జరిగిన ప్రమాదంపైన అందుకు బాధ్యులైన వారిపైన విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రాజెక్టుల్లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజా ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం వల్ల ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం జరిగింది. ఇంతకు ముందు సుంకిశాల, పెద్దవాగు ప్రమాదాలు జరిగినప్పుడు కూడా ప్రభుత్వం ఎలాంటి దర్యాప్తు చేయలేదు, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ప్రమాదాలపై హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో న్యాయ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలి. గతంలో ఇదే కాంగ్రెస్ పార్టీ నేతలు, ముఖ్యమంత్రి సహా, అనేక అంశాలపై న్యాయ కమిషన్‌ల ఏర్పాటు కోసం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అనేక న్యాయ కమిషన్‌లు ఏర్పాటు చేశారని కేటీఆర్ గుర్తు చేశారు.

తాజా ప్రమాదాలపై న్యాయ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని మేము మా పార్టీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఆర్మీ, ఇతర సంస్థల సహాయంతోఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెంటనే వెనక్కి తీసుకువచ్చేలా ప్రభుత్వం మరింతగా కృషి చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ సాహిత్య అకాడమి
సాహిత్యవారం
రేడియమ్ రచనలు
నమ్మలేని నిజాలు
జీవ గణితం
గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం
సభాధ్యక్షులు
డా.నామోజు బాలాచారి, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
అతిథి&ఆవిష్కర్త (నమ్మలేని నిజాలు)
బైసా దేవదాసు, ఎడిటర్, నేటినిజం
అతిథి&ఆవిష్కర్త (జీవగణితం)
డా.అమ్మంగి వేణుగోపాల్, ప్రముఖ సాహితీవేత్త
ఆత్మీయ అతిథులు
డా.చెన్నకేశవరెడ్డి, ప్రముఖ సాహితీవేత్త
డా.ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ సాహితీవేత్త
నాగవరం బలరాం, కవి
వేదిక: తెలంగాణ సాహిత్య అకాడమి కార్యాలయం, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-500 004
తేది: 01.03.2025 (శనివారం), సమయం : సా॥ 4.00 గంటలకు
సాహితీప్రియులందరికీ సాదర ఆహ్వానం..
RSVP : 040 - 29703142

# శివ శివ శంభో హర హర శంభో

**నాగేన్ద్రహారాయ త్రిలోచనాయ**
**భస్మాంగరాగాయ మహేశ్వరాయ ॥**
**నిత్యాయ శుద్ధాయ దిగమ్బరాయ**
**తస్మై నకారాయ నమః శివాయ ।1।**

అర్థం:

1.1: (శివుడికి నమస్కారం) అత్యంత అద్భుతమైన సర్పాలనుతన దండగా కలిగి ఉన్నవాడు, మూడు కళ్ళు కలిగి ఉన్నవాడు, 1.2: పవిత్ర బూడిదతో రంగు వేయబడిన (అంటే పూసిన) శరీరం కలిగినవాడు, గొప్ప ప్రభువు ఎవరు, 1.3: శాశ్వతుడు, ఎల్లప్పుడూ పవిత్రుడు, నాలుగు దిశలను తన దుస్తులుగా కలిగి ఉన్నవాడు (అతను ఎల్లప్పుడూ స్వేచ్ఛగా ఉన్నాడని సూచిస్తుంది), 1.4: పంచాక్షర మంత్రం "న-మ-శి-వా-య" యొక్క మొదటి అక్షరం "న" అనే అక్షరంతో సూచించబడినఆ శివుడికి నమస్కారం .

## ఉపోద్ఘాతం:

శివుడు హిందూ మతంలోని ప్రధాన దేవతలలో ఒకరు. శివ అనగా సంస్కృతంలో శుభం, సౌమ్యం అని అర్థాలున్నాయి. శివుడు త్రిమూర్తులలో చివరివాడైన లయకారుడు. శివుడు హిందువులు పూజించే దేవుళ్లలో ప్రథముడు. శివుడు పశుపతిగాను, లింగం రూపంలో సింధు నాగరికత ప్రారంభం నుండి పూజలందుకున్నారు. నేటికీ దేశమంతటా శివాలయాలే అధిక సంఖ్యలో ఉన్నాయి. వేదాలలో శివుడు రుద్రునిగా పేర్కొన్నారు. శైవంలో శివుని పరమాత్మగాను, ఆదిదేవునిగాను భావిస్తారు. శివుని ప్రత్యేకంగా ఆరాధించే హిందూ మతస్థులను శైవులంటారు. వినాయకుడు, కుమార స్వామి, అశోక సుందరి, జ్యోతి, మానసలు పార్వతీ పరమేశ్వరుల బిడ్డలు. శివ శబ్ద అర్థాలు-శివుడు జననమరణాలకు అతీతుడు, కాలతీతుడు అనగా కాలమునకు వశము కానివాడు. అందుకే సదాశివుడు అంటాము. విష్ణువు, బ్రహ్మ, ఇతర దేవతలు సదా శివలింగారాధన చేస్తుంటారు. పరమశివుడు ఎంతవరకు విస్తరించాడో కనుగొనటం అసంభవం. అది విష్ణువు, బ్రహ్మ లకు కూడా అసంభవం. అందుకే పరమశివుడు అంటారు. మరొక ఇతిహాసములో.. "బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులగు త్రిమూర్తులకు జన్మనిచ్చింది ఆదిపరాశక్తి అయిన శ్రీ రాజరాజేశ్వరీదేవి, త్రినేత్రం కలిగిన తనను ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు వివాహమాడవలసిందిగా కోరింది. మొదట ముగ్గురూ నిరాకరించారు. ఆమె నచ్చచెప్పిన పిమ్మట, శివుడు తనని వివాహమాడేందుకు అంగీకరించి, ఒక షరతు పెట్టి, తనను (ఆది పరాశక్తిని) వివాహమాడిన అనంతరం మూడవ నేత్రం శివునికి ఇవ్వాలి. అందుకు ఆ దేవత అంగీకరించి, వివాహానంతరం శివునికి మూడవ నేత్రం ఇవ్వడంతో, శివుడు ఆ మూడవ నేత్రంతో ఆ దేవతను భస్మం చేసి, ఆ భస్మరాశిని మూడు భాగాలుగా విభజించి, లక్ష్మి, సరస్వతి, పార్వతిలను సృష్టించారని ప్రతీతి."


## మహా శివరాత్రి:

హిందూ మత విశ్వాసాల ప్రకారం, మహా శివరాత్రి శివ భక్తులకు అత్యంత ముఖ్యమైన పండుగ. ప్రతి ఏటా మాఘ మాసం, క్రిష్ణ పక్షంలోని 14వ రోజు అంటే చతుర్దశి రోజున పురాణాల ప్రకారం, ఈ పవిత్రమైనే రోజునే శివపార్వతుల కళ్యాణం జరిగిందని చెబుతారు. అందుకే ఈ పర్వదినాన ఉపవాసం ఉండి, జాగరణ చేస్తూ శివయ్యను కొలిస్తే తమకు పరమేశ్వరుని అనుగ్రహం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. శాస్త్రాల ప్రకారం, మహా శివరాత్రి రోజు నుంచే ఈ సృష్టి ప్రారంభమైందంటారు. గరుడ పురాణం, స్కంద పురాణం, శివరాత్రి వర్ణన, పద్మ పురాణం, అగ్నిపురాణాల్లో శివరాత్రి గురించి అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ఈ పవిత్రమైన రోజున బిల్వ పత్రాలతో శివయ్యను పూజించి, శివ మంత్రాలను జపించిన వారికి మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా ఈ ఏడాది మహా శివరాత్రి ఎప్పుడొచ్చింది. పూజా విధానం గురించి ఇప్పుడు తెలుసుకుందాం...

ఈ ఏడాది మాఘ మాసంలోని క్రిష్ణ పక్షంలో చతుర్దశి తిథి అంటే 26 ఫిబ్రవరి 2025 బుధవారం ఉదయం 11:08 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ తిథి మరుసటి రోజు సాయంత్రం ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం 8:54 గంటలకు ముగుస్తుంది. ఈ మహా శివరాత్రి పర్వదినాన ప్రదోష కాలంలో శివయ్యను పూజిస్తారు. కాబట్టి ఉదయం తిథిని పాటించాల్సిన అవసరం లేదు. అయితే ఈసారి ఉదయం 11:08 గంటల నుంచి రాత్రి 10:05 గంటల వరకు భద్ర కాలం ఉంటుంది. అయితే శివుని మహాకాళం ప్రకారం భద్రకాలం శివయ్య ఆరాధనపై ఎలాంటి ప్రభావం చూపదు. కాబట్టి ఈరోజంతా మహాదేవుడిని పూజించొచ్చు. ఇదే రోజున శ్రవణ నక్షత్రం కూడా ఏర్పడుతుంది.

మహాశివరాత్రి పండుగ ప్రాశస్త్యం:

మహాశివరాత్రి ప్రత్యేక పండుగ. ఆరోజు కుటుంబంలోని చిన్నా, పెద్ద అందరూ ఏకువ జామునే లేచి స్నానాదికాలు ముగించుకున్నవారై శివమహాదేవుని అత్యంత భక్తి శ్రద్ధలతో అభిషేకాలు, అర్చనలు జరుపుతూ, శివాలయాలను దర్శించుకుంటారు. ఆరోజంతా ఉపవాసంచేసి శివుని స్తోత్రాలు పారాయణం చేస్తూ ఓంకారంతోను, ఓం నమః శివాయా అనే మంత్రాన్ని పఠిస్తూ, శివ శివ శంభో హర హర శంభో అంటూ మహాదేవుని శివనామ స్మరణతో హోమాలు చేస్తుంటారు. రాత్రి సమయాన శివుని గీతాలు, భజనలు, శివ తాండవ నృత్యంతో కోలాహలంగా బోళాశం కరుని (శివుని) ప్రసన్నం చేసుకుంటారు. గురువులు భక్తులతో వారి వారి నియమానుసారంగా క్రియా యోగ, సుషుమ్న క్రియా యోగ మొదలైన ప్రక్రియల తో భక్తులను అలరిస్తూ, ప్రవచ నాలు బోధిస్తూ ధ్యానంతో భక్తుల కు సద్గతి పొందేవిధంగా శివ రాత్రి జాగరణ చేయించడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదా యంగా పేర్కొనవచ్చు. శివపార్వ తుల వివాహం జరిగిన రోజని, లింగాకారంలో ఉద్భవించిన రోజని శివపురాణంలో ఉవాచ. మహా శివరాత్రి చాంద్రమాన నెల లెక్కింపు ప్రకారం మాఘ మాసం యొక్క కృష్ణ పక్ష చతుర్దశి రోజున వస్తుంది. ప్రతీ ఏటా మాఘ బహుళ చతుర్దశి నాడు చంద్రుడు శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర యుక్తుడైనప్పుడు వస్తుంది. సంవత్సరంలో వన్నెండు శివరాత్రులలో మహా శివరాత్రి అత్యంత పవిత్రమైనదిగా భావింపబడు తుంది.



## రుద్రాభిషేకం:

వేదాలలోనుండి ప్రత్యేకమైన మంత్రాలను రుద్ర సూక్తంగా పండితులచే పఠించబడుతుంది. దీనిని శివలింగానికి ప్రాతఃకాలంలో పవిత్రస్నానం చేయిస్తారు. దీనినే రుద్రాభిషేకం అంటారు. శివలింగంతో బాటు గండకీ నదిలో మాత్రమే లభించే సాలిగ్రామం కూడా పూజలందుకుంటుంది. దీనిద్వారా మనసులోని మలినాల్ని తొలగించుకోవడమే ఇందులోని పరమార్థం.

## పుష్పాలతోను, బిల్వపత్రాలతో అర్చన:

శివునకి ప్రీతికరమైన పుష్పాలతోను, బిల్వపత్రాలతో అర్చన చేస్తుంటారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, రకరకాల పండ్లు, ఇత్యాదులతో శివుని సేవిస్తూ వారి వారి తాహతుకు లోబడి, భక్తులు శివుని సేవించి తరించడం పరిపాటి. రోజంతా పగలు రాత్రి ఉపవాసం ఉండి రాత్రి అంతా జాగరణ చేసి మరుసటి రోజు భోజనం సేవిస్తారు. అన్ని శివక్షేత్రాలలో ఈ ఉత్సవము గొప్పగా జరుగుతుంది. శైవులు ధరించే భస్మము/విభూతి తయారుచేయటానికి ఈనాడు పవిత్రమైనదని భావిస్తారు.

## ఆధ్యాత్మిక శక్తి:

తపస్సు, యోగ, ధ్యానం వాటి అభ్యాసంతో క్రమంగా, వేగంగా జీవితం యొక్క గమనము అత్యధికంగా ముక్తి పొందడానికి ఆరోజంతా శివుని సేవలో, ధ్యానంలో తరిస్తారు. మహా మృత్యుంజయ మంత్రం వంటి శక్తి వంతమైన పురాతన సంస్కృత మంత్రాల యొక్క ప్రయోజనాలు శక్తి ఈ రాత్రి గొప్పగా పెరుగుతుంది.

## పంచాక్షరి మంత్రం:

పంచాక్షరి మంత్రం శివస్తోత్రాలలో అత్యుత్తమమైనది. ఈ మంత్రంలోని పంచ అనగా అయిదు అక్షరాలు "న" "మ" "శి" "వా" "య" (ఓం నమశ్శివాయ) నిరంతరం భక్తితో ఈనాడు పఠిస్తే శివసాయుజ్యం ప్రాప్తిస్తుంది.

## మహామృత్యుంజయ మంత్రం:

మహామృత్యుంజయ మంత్రం ఋగ్వేదం (7.59.12)లోని ఒక మంత్రము. దీనినే "త్రయంబక మంత్రము", "రుద్ర మంత్రము", "మృత సంజీవని మంత్రము" అని కూడా అంటారు. ఈ మంత్రాన్ని మృత్యుభయం పోగొట్టుకోవడానికి, మోక్షం కొరకు జపిస్తారు.

**ఓం త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టి వర్ధనం**
**ఊర్వారుకమివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మామృతాత్**

**దక్షిణ భారతదేశంలో మహాశివరాత్రి:**

మహా శివరాత్రి ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు అన్ని దేవాలయాలు విస్తృతంగా జరుపుకుంటారు. శ్రీకాళహస్తిని కాశీ కన్నా మహిమాన్వితమైన క్షేత్రంగాను, దక్షిణ కైలాసంగాను భావిస్తారు. తమిళనాడులోని తిరుచిరాపల్లికి 11 కి.మీ. దూరంలో శివుని జంబుకేశ్వరాలయం, పవిత్ర కావేరి నది ఒడ్డున ఉన్నది. అలాగే అరుణాజలం, చెన్నైకి 185 కి.మీ. దూరంలో శివుడు తేజోలింగస్వరూపుడై విరాజిల్లుతాడు. ఈ క్షేత్రాన్ని అగ్ని క్షేత్రమని అంటారు. శివుడు (మొదటి) ఆదిగురువుగా భావిస్తారు. శివుడు నుండి యోగ సంప్రదాయం ఉద్భవించింది. సంప్రదాయం ప్రకారం, మానవ వ్యవస్థలో శక్తి సహజంగా ఉంది. ఆ శక్తి పెంపొందేందుకు ఈ రాత్రి శక్తివంతమైన గ్రహ స్థానాలు అటువంటివి ఉన్నాయి. రాత్రి అంతా (జాగరూకత), మెలుకువగా ఉన్న ఒక వ్యక్తి, శారీరకంగాను, ఆధ్యాత్మికంగాను క్షేమాన్ని పొందుతారని చెబుతారు. ఈ రోజు, అటువంటి శాస్త్రీయ సంగీతం, నృత్యం వంటి వివిధ రంగాలలో నుండి కళాకారులు మొత్తం రాత్రి అంతా జాగారం చేస్తారు.

భారతదేశంలోను విదేశాలలోను మహాశివరాత్రి:

ఉత్తరభారతంలోని, కాశీ క్షేత్రం ప్రముఖ దేవాలయంగా పేరుపొందినది. పుట్టిన ప్రతి ఒక్కరు జీవితంలో ఒక్కసారైనా గంగానదిలో స్నానమాచరించి, కాశీ క్షేత్రాన్ని దర్శించి తొమ్మిది (9) రాత్రులు నిద్రచేసిన వారు శివసాన్నిధ్యం పొందగలరని విశ్వసిస్తారు. మహాకాళేశ్వర్ దేవాలయం, ఉజ్జయినీ పేరున స్వామి శివుడు వేంచేసిన పవిత్ర అత్యంత ప్రాచు ర్యం పొందిన దేవాలయాల్లో ఒకటి. ఇక్కడికి శివ భక్తులు పెద్ద సమూ హాములతో మహా శివ రాత్రి రోజున ప్రార్థన లు చేయడానికి ప్రతి సంవత్సరం చేరుకుం టారు. నేపాల్ లో, కోట్లాది హిందువుల ప్రఖ్యాత పశుపతినాథ్ ఆలయం వద్ద ప్రపంచం లోని వివిధ ప్రాంతాల నుండి కలిసి శివరాత్రికి హాజరు అవుతారు. ట్రినిడాడ్, టొబాగోలో, దేశవ్యా ప్తంగా వేలాది హిందు వులు 400 పైగా ఆలయాల్లో పవిత్రమైన మహాశివరాత్రి రోజు రాత్రి శివుడికి ప్రత్యేక అభిషేకాలను అందించటం ద్వారా గడుపుతారు. వేలాది భక్తులు శివరాత్రి రోజు బాగమతి నదిలో స్నానము చేసి, శివరాత్రి పండుగ జరుపుకొంటారు. బంగ్లాదేశ్లో హిందువులు కూడా మహా శివరాత్రి జరుపుకుంటారు.

## హాలాహలం సేవనం:

సాగర మథనం పురాణం ప్రకారం, సాగర మథనం యొక్క ఉత్పత్తులలో ఒకటి అయినటువంటిది హాలాహలం ఉద్భవించింది. శివుడు ఆ హాలాహలం మొత్తం తీసుకోవడం వలన, హాలాహలం యొక్క ఘోరమైన ప్రభావాల నుండి ప్రపంచం మొత్తం రక్షించడం జరిగింది. శివుడు తన యోగ అధికారాల ద్వారా తన గొంతులో హాలాహలం నిక్షిప్తం చేయడం వలన, ఆ ప్రభావంతో కంఠం నీలంగా మారినది, అందుచేతనే శివుని నీలకంఠుడు, గరళ కంఠుడు అంటారు. శివుడు బ్రహ్మ గర్వము అణచడానికి తన కనుబొమ్మల నుండి భైరవుడిని సృష్టించి పదునైన కత్తితో ఈ బ్రహ్మను శిక్షించుము అని చెబుతాడు. ఆ భైరవుడు వెళ్లి బ్రహ్మ పంచముఖాలలో ఏ ముఖము అయితే అసత్యము చెప్పిందో ఆ ముఖాన్ని పదునైన కత్తితో నరికి వేస్తాడు. అప్పుడు మహావిష్ణువు శివుడి వద్దకు వెళ్లి, పూర్వము ఈశ్వర చిహ్నంగా బ్రహ్మకు ఐదు ముఖాలు ఇచ్చి ఉంటివి. ఈ మొదటి దైవము అగు బ్రహ్మను ఇప్పుడు క్షమించుము అన్నాడు. ఆ మాటలు విన్న శివుడు శరణు జొచ్చిన బ్రహ్మను (పిల్లవానిని తప్పుడు చేతకై దండించి తప్పు తెలుసుకొన్న తరువాత కారుణ్యమును ప్రకటించిన తండ్రిలా) ఉద్దేశించి గొప్ప వరమును ప్రసాదించెను. బ్రాహ్మణి క్షమించి, "ఓ బ్రహ్మ నీకు గొప్పనైన దుర్లభమైన వరమును ఇస్తున్నాను, అగ్నిష్టోమము, దర్శ మొదలగు యజములలో నీది గురుస్థానము. ఎవరేని చేసిన యజములలో అన్ని అంగములు ఉన్నా అన్నింటినీ సరిగా నిర్వర్తించినా, యజనిర్వహణముచేసిన బ్రాహ్మణులకు దక్షిణలు ఇచ్చినా, నీవు లేని యజ్ఞము వ్యర్థము అగును" అని వరమిచ్చెను. మొగలి పువ్వు (కేతకీపుష్పము) వైపు చూసి, అసత్యము పల్కిన నీకు పూజార్హతలేకుండు గాక అని అనగానే దేవతలు కేతకీపుష్పాన్ని దూరంగా ఉంచారు. దీనితో కలతచెందిన కేతకీపుష్పము పరమేశ్వరుడవైన నిన్ను చూసిన తరువాత కూడా అసత్య దోషము ఉండునా అని మహాదేవుడిని స్తుతించింది. దానితో ప్రీతి చెందిన శివుడు అసత్యము చెప్పిన నిన్ను ధరించడం జరగదు, కాని కేతకీ పుష్పాన్ని నా భక్తులు ధరిస్తారని వరమిచ్చిన శివుడు. అదేవిధంగా అసత్యాన్ని చెప్పిన కామధేనువును, అసత్యమాడినందుకు, పూజకు పనికిరావని కామధేనువుకు శాపమిచ్చాడు. వెంటనే తోకతో నిజం చెప్పాను కనుక క్షమించుమని కామధేనువు శివుని ప్రాధేయపడింది. భోలాశంకరుడు కనుక, కోపమును దిగమ్రింగి, "మొగముతో అసత్యమాడితివి కనుక నీ మొగము పూజనీయము కాదు, కాని సత్యమాడిన నీ పృష్ఠ భాగము పునీతమై, పూజలనందుకొనును" అని శివుడు వాక్రుచ్చెను. అప్పటి నుండి గోముఖము పూజార్హము కానిదైనది, గోమూత్రము, గోమయము, గోక్షీరములు పునీతములైనవి. పూజా, పురస్కారములలో వాడబడుచున్నది. అందుకే భోళాశంకరుడన్న పేరున్న శివుడెంతో... దయార్ధ హృదయుడు.

## మహాశివరాత్రి వ్రత కథ:

ఒకనాడు కైలాసపర్వత శిఖరముపై పార్వతీపరమేశ్వరులు సుఖాసీనులై ఉండగా పార్వతి శివునితో అన్ని వ్రతములలోను ఉత్తమమగు వ్రతమును భక్తి ముక్తి ప్రదాయకమైన దానిని తెలుపమని కోరెను. అప్పుడు శివుడు శివరాత్రి వ్రతమనుదాని విశేషాలను ఈ విధముగా, ఈ వ్రతమును మాఘబహుళచతుర్దశి నాడు ఆచరించవలెనని, తెలిసికాని, తెలియకగాని ఒక్కమారు చేసినను యముని నుండి తప్పుంచుకొని ముక్తి పొందుదురని దాని దృష్టాంతముగా ఈ క్రింది కథను వినిపించెను.

ఒకప్పుడు ఒక పర్వతప్రాంతమున హింసావృత్తిగల వ్యాధుడొకడు వుండెను. అతడు ప్రతి ఉదయం అడవికి వేటకు వెళ్ళి సాయంత్రం ఏదేని మృగమును చంపి తెచ్చుచు కుటుంబాన్ని పోషించేవాడు. కానీ ఒకనాటి ఉదయమున, అడవియంతా తిరిగినా ఒక్క మృగము కూడా దొరకలేదు. చీకటిపడుతున్నా ఉత్తచేతులతో ఇంటికి వెళ్ళడానికి మనస్కరించక వెనుతిరిగెను. దారిలో అతనికొక తటాకము కనిపించెను. ఏవైనా మృగాలు నీరు త్రాగుట కోసం అచ్చటికి తప్పకుండా వస్తాయని వేచియుండి, వాటిని చంపవచ్చునని ఆలోచించి దగ్గరనున్న ఒక చెట్టెక్కి తన చూపులకు అడ్డముగా నున్న ఆకులను, కాయలను విరిచి క్రింద పడవేయసాగెను. చలికి "శివ శివ" యని వణుకుచూ విల్లు ఎక్కుపెట్టి మృగాల కోసం వేచియుండెను. మొదటిజామున ఒక పెంటిలేడి నీరు త్రాగుటకు అక్కడికి వచ్చెను. వ్యాధుడు దానిపై బాణము విడువబోగా లేడి భయపడక "వ్యాధుడా! నన్ను చంపకుము" అని మనుష్యవాక్కులతో ప్రార్థించెను. వ్యాధుడు ఆశ్చర్యపడి మనుష్యులవలె మాట్లాడు నీ సంగతి తెలుపుమని కోరెను. దానికి జింక "నేను పూర్వజన్మమున రంభయను అప్సరసను. హిరణ్యాక్షుడను రాక్షసరాజును ప్రేమించి శివుని పూజించుట మరచితిని. దానికి రుద్రుడు కోపించి కామాతురయైన నీవు, నీ ప్రియుడును జింకలుగా పన్నెండేళ్లు గడిపి ఒక వ్యాధుడు బాణముతో చంపనుండగా శాపవిముక్తులౌదురని సెలవిచ్చెను. నేను గర్భిణిని, అవధ్యను కనుక నన్ను వదలుము. మరొక పెంటిజింక ఇచటికి వచ్చును. అది బాగుగా బలిసినది, కావున దానిని చంపుము. లేనిచో నేను వసతికి వెళ్ళి ప్రసవించి శిశువును బంధువుల కప్పగించి తిరిగివస్తాను" అని అతన్ని వొప్పించి వెళ్ళెను. రెండవజాము గడిచెను. మరొక పెంటిజింక కనిపించెను. వ్యాధుడు సంతోషించి విల్లెక్కుపెట్టి బాణము విడువబోగా అదిచూచిన జింక భయపడి మానవవాక్కులతో "ఓ వ్యాధుడా, నేను విరహముతో కృశించియున్నాను. నాలో మేదోమాంసములు లేవు. నేను మరణించినా నీ కుటుంబానికి సరిపోను. ఇక్కడికి అత్యంత స్థూలమైన మగజింక యొకటి రాగలదు. దానిని చంపుము, కానిచో నేనే తిరిగివత్తును" అనెను. వ్యాధుడు దానిని కూడా విడిచిపెట్టెను. మూడవజాము వచ్చెను. వ్యాధుడు ఆకలితో జింక కోసం వేచియుండెను. అంతలో ఒక మగజింక అక్కడికి వచ్చెను. వింటితో బాణము విడువబోగా ఆ మృగము వ్యాధుని చూచి మొదటి రెండు పెంటి జింకలు తన ప్రియురాలుల్ని తానే చంపెనా అని ప్రశ్నించెను. అందుకు వ్యాధుడు ఆశ్చర్యపడి రెండు పెంటిజింకలు మరలివచ్చుటకు ప్రతిజ్ఞచేసి వెళ్ళినవి, నిన్ను నాకు ఆహారముగా పంపుతాయని చెప్పాయని అన్నాడు. ఆ మాట విని "నేను ఉదయాన్నే మీ ఇంటికి వచ్చెదను నా భార్య ఋతుమతి. ఆమెతో గడిపి బంధుమిత్రుల అనుజ్ఞపొంది మరలివత్తును అని ప్రమాణములు చేసి వెళ్ళెను. ఇట్లు నాలుగు జాములు గడిచి సూర్యోదయ సమయంలో వ్యాధుడు జింకల కొరకు ఎదురుచూచుచుండెను. కొంతసేపటికి ఆ నాలుగు జింకలును వచ్చి నన్ను మొదట చంపుము, నన్నే మొదట చంపుమని అనుచు వ్యాధుని ఎదుట మోకరిల్లెను. అతడు మృగముల సత్యనిష్టకు ఆశ్చర్యపడెను. వానిని చంపుటకు అతని మనసు ఒప్పలేదు. తన హింసావృత్తిపై జుగుప్స కలిగెను. "ఓ మృగములారా! మీ నివాసములకు వెళ్ళుము. నాకు మాంసము అక్కరలేదు. మృగములను బెదరించుట, బంధించుట, చంపుట పాపము. కుటుంబము కొరకు ఇక నేనా పాపము చేయను. ధర్మములకు దయ మూలము. సత్యఫలము. నీవు నాకు గురువు, ఉపదేష్టవు. కుటుంబ సమేతముగా నీవు వెళ్ళుము. నేనిక సత్యధర్మము నాశ్రయించి అస్త్రములను వదలిపెట్టుదును." అని చెప్పి ధనుర్బాణములను పారవేసి మృగములకు ప్రదక్షిణ మాచరించి నమస్కరించెను. అంతలో ఆకాశమున దేవదుందుభులు మ్రోగెను. పుష్పవృష్టి కురిసెను. దేవదూతలు మనోహరమగు విమానమును తెచ్చి యిట్లనిరి: ఓ మహానుభావా. శివరాత్రి ప్రభావమున నీ పాతకము క్షీణించింది. ఉపవాసము, జాగరమును జరిపితివి, తెలియకయే యామ, యామమునను పూజించితివి, నీవెక్కినది బిల్వవృక్షము. దానిక్రింద స్వయంభూలింగ మొకటి గుబురులో మరుగుపడియున్నది. నీవు తెలియకయే బిల్వపత్రముల త్రుంచివేసి శివలింగాన్ని పూజించితివి. సశరీరముగా స్వర్గమునకు వెళ్ళుము. మృగరాజా! నీవు సకుటుంబముగా నక్షత్రపదము పొందుము." ఈ కథ వినిపించిన పిదప పరమేశ్వరుడు పార్వతితో నిట్లనెను: దేవీ! ఆ మృగకుటుంబమే ఆకాశమున కనిపించు మృగశిర నక్షత్రము. మూడు నక్షత్రములలో ముందున్న రెండూ జింకపిల్లలు, వెనుకనున్న మూడవది మృగి. ఈ మూడింటిని మృగశీర్ష మందురు. వాని వెనుక నుండు నక్షత్రములలో ఉజ్జ్వలమైనది లుబ్ధక నక్షత్రము. ఆ తరువాత బ్రహ్మ, విష్ణువు ఆదిగా గల దేవతలు శివుడిని ధూపదీపాలతో అర్చించారు. దీనికి మెచ్చి శివుడు అక్కడి వారితో "మీరీనాడు చేసిన పూజకు సంతసించితిని. ఈ రోజు నుండి నేను అవతరించిన ఈ తిథి శివరాత్రి పర్వదినముగా ప్రసిద్ధి చెందుతుంది. ఈ రోజున ఉపవాసము చేసి భక్తితో నన్ను లింగ రూపముగా, సాకార రూపముగా ఎవరు అర్చిస్తారో వారికి మహాఫలము కలుగుతుంది" అని చెబుతాడు. తాను ఈ విధంగా అగ్నిలింగరూపముగా ఆవిర్భవించిన ప్రదేశము అరుణాచలముగా ప్రసిద్ధిచెంద గలదని చెబుతాడు.

జాగరణము:

జాగరణము అనగా ప్రకృతిలో నిద్రాణమైయున్న శివశక్తిని, శివపూజా, భజన లీలా శ్రవణాదులతో మేల్కొలిపి, తాను శివుడై, సర్వమును శివస్వరూపముగా భావించి, దర్శించుటయే నిజమైన జాగరణము. అప్పుడు శివపూజలో సాయుజ్యము, శివభజనలో సామీప్యము, శివభక్తులతో కూడి, శివ విషయములు ప్రసంగించుటలో సలోక్యము, శివధ్యానములో సారూప్యము సిద్ధించునని ఆదిశంకరాచార్యులు మాట ప్రత్యక్ష సత్యమగును. ఈ నాలుగింటినీ శివరాత్రి నాడు ప్రత్యక్షముగా సాధించుటయే శివరాత్రి జాగరణము. జాగరణ దినమున ఉపవాసము ఉంటారు. ఈ జాగరణ సమయంలో తామున్న గృహ ఆవరణలోనో, తమ స్వంత పంటపొలాల్లోనో అక్కడి మట్టితో అక్కడే శివలింగాన్ని తయారుచేస్తూ జాముకొక శివలింగం తయారుచేసి పూజిస్తారు. ఈ రోజు, అటువంటి శాస్త్రీయ సంగీతం, నృత్యం వంటి వివిధ రంగాలలో నుండి కళాకారులు మొత్తం రాత్రి అంతా జాగారం చేస్తారు.

మహాశివరాత్రి రోజున తీసుకోవలసిన ఆహారం:

బంగాళాదుంపలు, చిలకడ దుంపలు ఉడికించినవి మాత్రమే.

నాన్ ధాన్యపు వంటకాలు:

పాలు ఆధారిత పానీయాలు

పండ్లు (ఫ్రూట్ జ్యూసెస్, ఫ్రూట్ సలాడ్) మరియు పొడి పండ్లు (డ్రైఫ్రూట్స్)

కనుక ఈ మహాశివరాత్రి అనేది ఒక ప్రత్యేకమైన అవకాశం. ఈ మహాశివరాత్రి పర్వదినాన్ని నియమ నిష్ఠలతో శివుని ఆరాధించి, అర్చించి శివుని ప్రసన్నుని చేసుకోవడంద్వారా, శివుని అనుగ్రహం పొందినవారై, శాంతి, అవగాహన, దైవంతో ఏకత్వం యొక్క భావన వైపు నడిపిస్తుంది! భౌతికంగా ఆధ్యాత్మిక లక్ష్యాలను కోరుకునే భక్తులకు శివుడు అంతిమ అభయారణ్యం. ప్రపంచవ్యాప్తంగా, ప్రజలు ఓదార్పు పొందడానికి, అంతర్గత శాంతిని పొందటానికి అవకాశం. ప్రపంచం కొత్త ఆరంభాలు, మేల్కొలువుల కోసం ఎదురుచూస్తున్నప్పుడు, 'మహాశివరాత్రి' కన్నా ప్రత్యేకమైన పండుగ రోజు ఇంకేముంటుంది. శుభప్రదమైన ప్రారంభానికి, ఆలోచనలకు ఈ శివరాత్రి భక్తులందరికీ సదవకాశం. ఆది గురువైన శివునియొక్క ప్రత్యేకతను కలిగియున్న ఈ రోజే ఏ పని ప్రారంభించినా, శుభారంభం.... శుభాకాంక్షలు, శివ శివ శంభో హర హర శంభో అంటూ శివుని స్తుతిస్తూ ధన్యులవుదాం.

శుభం భూయాత్!
సర్వేజనాః సుఖినో భవంతు!



-శారద శృంగేరి
9490261119

## 14 నెలలుగా నిరుద్యోగ భృతి ఇవ్వనోళ్లు పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తారా..

**-గత బిఆర్ఎస్ అడుగుజాడల్లోనే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది..**
**-నిరుద్యోగ పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కిగుణపాఠం చెప్పాలి.**
**-బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి..**
**-బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్....**



కరీంనగర్, ఫిబ్రవరి 25: (నేటినిజం ప్రతినిధి) అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల్లో భాగంగా నిరుద్యోగులకు ప్రతి నెల రూ 4 వేలు అందిస్తామని హామీ ఇచ్చి నేడు నిరుద్యోగులందరిని మోసం చేసిందని, నిరుద్యోగుల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం 14 నెలలైనా నిరుద్యోగ భృతి ఇవ్వలేని దుస్థితిలో ఉందని, ఒక్కో నిరుద్యోగికి రూ.54 వేలు ప్రభుత్వం బాకీ పడిందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ లోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయనమాట్లాడుతూ నిరుద్యోగ భృతి ఇవ్వలేనోళ్లు నిరుద్యోగ పట్టభద్రుల సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, ఏటా జాబ్ క్యాలెండర్ లాంటి ప్రధాన అంశాలతో నిరుద్యోగ యువతీ యువకులను నిలువునా మోసం చేసిందన్నారు. పట్టభద్రుల సమస్యల పట్ల గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, అందుకే నేడు మొఖం లేక ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి కి వచ్చిందన్నారు. గత సీఎంకెసిఆర్ అడుగుజాడల్లో నేసీఎం రేవంత్ రెడ్డి నడుస్తున్నారని పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు . కాంగ్రెస్ పాలనలో పట్టభద్రులకు ఏ లాంటి న్యాయం జరిగే పరిస్థితి కనబడడం లేదన్నారు. నిరుద్యోగ సమాజానికి అండగా నిలిచి, పట్టభద్రుల సమస్య పరిష్కారం కోసం గళం విప్పింది , కొట్లాడింది , ఉద్యమించింది, కేవలం బిజెపి, బీజేవైఎం మాత్రమేనన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కేవలం బిజెపితోనే సాధ్యమన్నారు. అందుకే జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి అంజి రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఆనాడు 317 జీవో కు వ్యతిరేకంగా కొట్లాడి, ఉపాధ్యాయులకు అండగా నిలిచిన బిజెపికి నేడు ఉపాధ్యాయులు అందరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని , బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఈసందర్భంగా కోరారు. ఈకార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దురిశెట్టి సంపత్, రాష్ట్ర కార్యదర్శి యువ క్రాంతి, కార్యాలయం కార్యదర్శి అరవింద్,జిల్లా ఉపాధ్యక్షులు బోడ్డ అశోక్,గుండారపు సంపత్,తోట సాయి,అజయ్,సోషల్ మీడియా కన్వీనర్ ఉప్పారపల్లి శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి ఈసంపల్లి మహేష్,జోన్ అధ్యక్షులు పొన్నాల రామ్, శ్రీమంతుల అక్షయ్,తోట సతీష్ లు పాల్గొన్నారు..

## మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

కోల్ సిటీ, ఫిబ్రవరి 25 : గోదావరిఖని రమేష్ నగర్ ఏరియాలో కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికివిశేష స్పందన లభించింది. సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, ఇతరులు ఈ శిబిరానికి హాజరు కాగా జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి బీపీ, షుగర్, 2 డి ఏకో పరీక్షలు చేపట్టి రోగ నిర్ధారణ చేశారు.

మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ సింగరేణి రిటైర్డ్ కార్మిక కుటుంబాలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. 24 గంటల పాటు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ శిబిరంలో డివిజన్ నాయకులు గట్ల రమేష్, రామస్వామి, కృష్ణ, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోటా కరుణాకర్, హరీష్, యూనస్ పాల్గొన్నారు.

## 'ప్రయాగ్ పాలిమర్స్' ఇత్తడి కుళాయిలు ఆవిష్కరణ- మ్యాట్ బ్లాక్, గోల్డ్, రోజ్ గోల్డ్ రంగులలో..

హైదరాబాద్, ఫిబ్రవరి 25: భారత్లో ప్రముఖ బాత్వేర్, శానిటరీవేర్ తయారీదారులు ప్రయాగ్ పాలిమర్స్ అత్యాధునిక ఇత్తడి కుళాయిల కలెక్షన్ను ఆవిష్కరించింది. అధిక నాణ్యతతో కూడిన ఈ ఇత్తడి కుళాయిలు తుప్పు పట్టవు. ఈ సందర్భంగా ప్రయాగ్ పాలిమర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నితిన్ అగర్వాల్ మాట్లాడుతూ లగ్జరీ హోమ్స్, హోటల్స్, ఆధునిక కార్యాలయాలు, రెస్టారెంట్లకు ఇవి ఒక విలాసవంతమైన, మన్నికైన ఎంపికగా మారతాయన్నారు. అధునాతన కార్ట్రిడ్జ్లతో సజావుగా పని చేసే ఈ





కుళాయిలు తక్కువ నిర్వహణతో ఎంతో అందంగా ఉంటాయన్నారు. ఈ కుళాయిలు మ్యాట్ బ్లాక్, గోల్డ్, రోజ్ గోల్డ్ రంగాలలో కలవన్నారు. ఇవి విభిన్న ఇంటీరియర్ శైలులకు అద్భుతంగా సరిపోతాయని పేర్కొన్నారు. కిచెన్, బాత్ రూమ్లలో ఎంతో అందంగా ఉంటాయని తెలిపారు. ఈ కలెక్షన్ ఈ ప్రీమియం కుళాయిలు పరిశ్రమలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడమే కాకుండా.. నమ్మకమైన, అందమైన బాత్వేర్, కిచెన్ వేర్ కోరుకునే వినియోగదారులతో బలమైన సంబంధాన్ని పెంపొందించాలన్న మా లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తుందని పేర్కొన్నారు. నీటిని ఆదా చేస్తూ అధిక పని తీరును అందించే మా కుళాయిలు ఎంతో మన్నికగలవన్నారు. ఈ ఫాసెట్స్ నీటి ప్రవాహాన్ని సమర్థవంతంగా నియంత్రించడంతో పాటు పని తీరును ప్రభావితం చేయకుండా నీటి వృథాను తగ్గించేందుకు ప్రత్యేకంగా రూపొందించబడ్డాయన్నారు. దశాబ్దాల అనుభవంతో వినియోగదారుల మారుతున్న అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వినూత్నత, అధిక నాణ్యత, ఆధునిక జీవన శైలిని కొత్త ఒరవడిలో నిర్వచించేందుకు ఈ బ్రాండ్ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

## ఫైబర్ నెట్ ఎండీగా ప్రవీణ్ ఆదిత్య

అమరావతి, ఫిబ్రవరి 25:ఏపీ ఫైబర్ నెట్ ఎండీగా ప్రవీణ్ ఆదిత్యను నియమించారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఏపీ గ్యాస్, డ్రోన్ కార్పోరేషన్ల అదనపు బాధ్యతలను కూడా ఆయనకు అప్పగించారు. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు ఫైబర్ నెట్ ఎండీగా ఉన్న దినేష్ కుమార్ ను నిన్న ఆ బాధ్యతల నుంచి తప్పించారు. దీంతో ఈ కొత్త నియామకాన్ని ప్రభుత్వం చేసింది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.